# కొత్తపల్లి

## పిల్లల కథల పుస్తకం



66

# కొత్తపల్లి పిల్లల కథల పుస్తకం-66 మార్చి 2014

మూలం: http://kottapalli.in/2014/03/welcome

**ఏపని- ఎవరిది:**

ప్రచురణ: కొత్తపల్లిప్రచురణలు, చెన్నేకొత్తపల్లి

నిర్వహణ: సత్యఫౌండేషన్, చెన్నూరు.

ప్రధానసంపాదకులు: నారాయణ

సహసంపాదకత్వం: మంజునాథ్

చిత్రాలు: వీరాంజనేయులు, అడవిరాముడు

సాంకేతికసహకారం: ఆనంద్, లక్ష్మి

వాణిజ్యం: మల్లికార్జున

గౌరవసలహాదారు: సుబ్బరాజు

అక్షరకూర్పు: కొత్తపల్లి

అలంకరణ: యాక్‌తూ ఫైన్ఆర్ట్స్‌స్టుడియో, హైదరాబాదు. ఫోను: 04042206233

ముద్రణ: ముద్రికా ఆఫ్‌సెట్‌ప్రింటర్స్, విజయవాడ ఫోను: 08662579129

స్వాగతం!

కొత్తపల్లిలో పిల్లల రచనలకు ప్రాధాన్యత ఉంటుంది. ఈ పుస్తకంలో దాదాపు సగం కథలు పిల్లలు రాసినవి; మిగిలినవి పిల్లలకోసం పెద్దలు రాసినవి. బొమ్మలు వేసిన వాళ్ళు మటుకు యువకులు.

పిల్లలను కలవటం, వాళ్లతో తెలుగులో కథలు రాయించటం, బొమ్మలు వేయించటం, వాళ్ళు పంపిన కథల్నీ, బొమ్మల్నీ సరిదిద్ది మిగతా పిల్లలందరికీ నచ్చేట్లు పుస్తకాలుగా తయారు చేయటం, దానికోసం ఓపెన్ సోర్సు ఉపకరణాలను వాడటం, కథల్ని అందరూ ఉచితంగా చదువుకునేట్లు ఇంటర్నెట్‌లో పెట్టటంతోపాటు, కొన్ని ప్రతులు అచ్చువేయటం మాకు ఇష్టం. అందరి మేలూ కోరి చేసే ఈ పనిలో మీరూ పాలుపంచుకోండి. పిల్లల కథల ప్రపంచానికి స్వాగతం!

ఇంటర్నెట్‌లో ఈ పుస్తకాన్ని వివిధ ఫార్మాటుల్లో ఉచితంగా చదవవచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు, అవసరమనిపిస్తే మీ వాణిజ్యేతర కార్యక్రమాలకోసం మీ అంతట మీరే దీన్ని ముద్రించుకోవచ్చు! వివరాలకు సందర్శించండి: "క్రియేటివ్ కామన్స్-షేర్ అలైక్-నాన్ కమర్షియల్ లైసెన్సు"

http://creativecommons.org/licenses/by-nc-sa/4.0/

**వెలల పట్టిక:**

| | వ్యక్తులు | సంస్థలు |
|---|---|---|
| **విడి ప్రతి వెల** (పోస్టేజీ అదనం) | **25** రూ. | 30 రూ. |
| **12 ప్రతులు** (పోస్టేజితో సహా) | **300** రూ. | 350 రూ. |

రానున్న 12 ప్రతులకోసం డబ్బుల్ని మనిఆర్డరు/బ్యాంకు ట్రాన్సుఫరు ద్వారా చెల్లించి మీ చిరునామాను పోస్టు/యస్సెమ్మెస్/ఇ-మెయిలు ద్వారా తెలియజేయండి. పుస్తకాలను సాధారణ పోస్టులో పంపుతాం,

మీ రచనలను పోస్టు/ఇమెయిలు రూపంలో పంపండి. బాగున్నవాటిని తప్పక ప్రచురిస్తాం!

బ్యాంకు ట్రాన్సుఫరు కోసం అక్కౌంటు వివరాలు:
Kottapalli Prachuranalu,
S.B. A/c No: 62320333310
SBH- Dharmavaram Branch,
ISFC code: SBHY0020902

కొత్తపల్లి ప్రచురణలు
1-127/A, యం ఆర్ వో ఆఫీసు దగ్గర,
చెన్నేకొత్తపల్లి- 515101
అనంతపురం జిల్లా
ఫోను: 7702877670 ఇ-మెయిలు: team@kottapalli.in
వెబ్‌సైటు: http://kottapalli.in

# విషయ సూచిక

**ముందుమాట**

తోట బాట.. సంపాదకీయం... 2

**ధారావాహిక**

నీతి చంద్రిక.. కందుకూరి వీరేశలింగం.. 5

**పిల్లలు రాసిన కథలు**

సోమరి పోతు విజయం... హేమంత్...11

పెద్దలమాట... మీనాక్షి...15

అమ్మ (కవిత)... శ్రీవాణి... 18

చెట్టు-సొరతీగ... శర్వాణి... 19

స్నేహ బంధం... సునీత బృందం... 22

పేదవారి బ్రతుకులు... జగదీశ్...27

పుస్తకాలు చదవటం కథ... పూజ... 29

సాహస బాలలు... నాగార్జున...32

**పెద్దలు రాసిన కథలు**

ఇంద్రధనస్సు రంగులు...ఝాన్సీరాణి... 37

సద్గుణం-దుర్గుణం...డా.సిరి... 40

నక్క నేర్చిన పాఠం.. రూమీ చెప్పిన కథ... 46

ఆనెస్టీ స్టాల్...ఆదూరి హైమవతి... 50

జింక-పులి... బౌద్ధ కథ... 55

ఎవరి సంపద... నారాయణ... 58

**అవీ ఇవీ**

పదాల్ని వెతకండి... కొత్తపల్లి... 45

సురవి-రిషి...యువకెరటాలు...63

# తోటబాట

అనగనగా ఓ తోట-

అసలది తోటో, కాదో తెలీదు. ఏవో కొన్ని చెట్ల లాంటివి, తుప్పల లాంటివి ఉన్నై తప్ప, దానికి నిజంగా తోటకుండాల్సిన లక్షణాలు వేరే ఏమీ లేవు. తోటలో ఎక్కడ చూసినా ఎండి మోడులైపోయిన చెట్లు. ఎండుటాకులు ఇరుక్కున్న బోడి కొమ్మలు. కాలిబాటల్లో నిండా ఒత్తుగా రాలిపడిపోయిన గోధుమరంగు ఆకులు. ఎటు చూసినా దుమ్ము. ఎడారిలో వీచినట్లు వేగంగా వీస్తున్న పొడిగాలి.

నీరసించి పోయిన చెట్లు తమ ఆకుల బరువును కూడా మోయలేక పోతున్నై. ఎండిపోయిన రెమ్మలు గాలికి కొట్టుమిట్టాడుతున్నాయి. ఎక్కడా ఒక పిట్టగాని, ఒక జంతువు గాని కానరావట్లేదు.

ప్రాణంలేని ఆ తోటలో, ఒకరోజున పుట్టిందో చిట్టి గడ్డి పువ్వు. పుట్టగానే కళ్ళు తెరిచి అటూ ఇటూ చూసింది. తోడుగా ఒక్క పువ్వూ కనబడలేదు.

చూసి చూసి చిట్టి పువ్వు తన చుట్టూ ఎగిరే ఎండుటాకులను పలకరించింది. "ఏంటన్నలూ, బాగున్నారా?!" అని.

జీవంలేని ఆకులు మూలిగాయి-" ఏం బాగు చెల్లీ, ఇదిగో ఇట్లా కొట్టుకుపోతున్నాం. నువ్వు వచ్చావేం పాపం, ఈ పాడు ప్రపంచంలోకి!" అంటూ అది ఇచ్చే జవాబు వినకనే ఎగిరిపోయాయి.

ఆకుల్ని ఎగరేసుకుపోతున్న సుడి గాలి చిట్టిపువ్వుని చూసి ఎగతాళిగా నవ్వింది-"ఏంటే, మిడిసి పడుతున్నావ్? కాలం కాని కాలంలో పుట్టింది చాలక, ఇంకా ముచ్చట్లు కావాలటనే,నీకు?" అని ఉరిమింది.

చిట్టి గడ్డి పువ్వు పాపం, చిన్నబోయింది. క్రిందికి వాలి తన ముఖాన్ని తల్లి రెమ్మల్లో దాచుకున్నది. తల్లి మొక్క దాన్ని చూసి నిట్టూర్చింది "పాపం, పిచ్చిది- కాలం కాని కాలంలో పుట్టింది. దీనికి ఒక్కతోడు కూడా లేదు" అనుకుంది.

అంతలోనే ఏమైందో మరి- చల్లటి పిల్ల గాలులు వీచాయి. ఆ గాలికి, అంతకు ముందున్న గాలికి ఎంత తేడా!? ఈ గాలి గుసగుసలాడింది- కొమ్మ కొమ్మనూ ఊపి చెప్పింది-"లేండమ్మా! లేండి! నిద్ర చాలించి లేవండి! గొప్ప సమయం వచ్చేసింది- ఇంకా నిద్రపోతారా, ఎక్కడన్నా, గలీజుగా?!" అంది.

మరునాడు చిట్టి గడ్డి పువ్వు లేచి చూసేసరికి కొమ్మలన్నీ కొత్త కొత్త చిగుళ్ళు తొడుక్కొని సిగ్గు పడుతున్నాయి. రెమ్మ రెమ్మా సంతోషంతో మొగ్గలు వేస్తున్నది.

"ఏమైంది, ఏమైంది" అంది గడ్డి పువ్వు.

"పండగొచ్చేసింది! పండగొచ్చేసింది!" అన్నది తల్లి చెట్టు సంబరంగా. అంతలోనే తుమ్మెదలూ, తేనెటీగలూ 'ఝుం..ఝుం.." అంటూ ఎగిరొచ్చి తిరగటం మొదలు పెట్టాయి. నిద్రపోతున్న చిట్టి చిట్టి మొగ్గలు ఒక్కొక్కదాన్నీ అవి తట్టి లేపాయి- "శుభోదయం! లేవండి లేవండి! పండగ రోజులు వచ్చేశాయి లేవండి!" అన్నాయి. వాటి మాటలు విని వికసించిన పువ్వుల్లోంచి వెలువడిన సువాసనల్ని మోసుకెళ్తూ కొత్తగాలి మహా బరువెక్కి మత్తెక్కించింది. చిట్టి గడ్డి పువ్వుకి మహా సంబరంగా ఉంది ఇదంతా.

అంతలోనే ఓ మూలగా వేపచెట్టు మీదికొచ్చి వాలిందో కోయిల. మరొకటి ఎగిరొచ్చి మామిడి చెట్టు మీద కూర్చున్నది. వచ్చీ రాగానే రెండూ పాటల పోటీ మొదలెట్టాయి.

"కొత్త యుగం వచ్చేసింది-లేవండోయ్-లేవండోయ్!

సంతోషంగా మీరందరూ కళకళలాడండోయ్! గలగల నవ్వండోయ్!" అని

అవి పాడే కొత్త పాటలు వింటూ చిట్టి గడ్డిపువ్వుతో సహా తోటలోని పూలన్నీ పరవశించి పోయాయి. ఎక్కడెక్కడినుంచో ఎగిరొచ్చిన పిట్టలు కిలకిలమంటూంటే, కొమ్మలన్నీ గలగలమన్నాయి. 'కొత్త చిగుళ్ళు తొడుగుదాం, నిజంగానే పండగ వచ్చేసింది!' అని ఒక్కటొక్కటిగా అన్ని చెట్లూ తొందరపడ్డాయి.

వసంతుడు చేసిన ఈ మాయాజాలంతో చిట్టి పొట్టి పిల్లలు, వాళ్ల అమ్మానాన్నలు అందరూ ఇప్పుడు తోటల బాట పట్టారు. వాళ్ల నవ్వులతో కలగలసిపోయిన పూల సొగసులు మాగొప్పగా అనిపిస్తున్నాయి.

వసంతుడు కురిపించిన మంత్రపు జల్లులో తడిసి, తోటలన్నీ చివురించాయి; ముగ్ధమనోహరంగా తయారయ్యాయి. ఆశలు మోసులు వేసే ఈ సమయంలో మరి మీరేం చేస్తున్నారు? ఇంట్లోనే ఉన్నారా, పదండి, తోటబాట పట్టండి!

పిల్లల్లో సృజనాత్మకత సహజం. కథలు, ఆటలు, పాటలు, బొమ్మలు దానికి ఊతాన్నిస్తాయి. మాతృభాషలో ఇష్టంగా చదవటం, తేలికగా రాయటం వస్తే, అటుపైన అన్ని శాస్త్రాలూ సులభంగా వంటపట్టుతాయి- నిజం! అందుకని మీ పిల్లల్లో ఉన్న కాల్పనిక శక్తికి పదును పెట్టండి. వాళ్లను కథలు రాసేందుకు, పాటలు పాడేందుకు, బొమ్మలు వేసేందుకు ప్రోత్సహించండి. వాళ్ళ రచనల్ని మాకు పంపండి. కావాలనిపిస్తే మీరే ఇలాంటి పత్రికనొకదాన్ని మొదలు పెట్టండి- ఎలాగైనా సరే- పిల్లలు పెద్దవాళ్లయ్యేలోగా వాళ్ళు చాలా చాలా తెలుగు కథల్ని చదివేలా, రాసేలా చేయండి. మీ పిల్లలకు ఈ పత్రికలోని కథలు నచ్చుతాయనే మా నమ్మకం- వీటిని వీలైనంత మందితో పంచుకోండి. మీరు రాసిన పిల్లల కథలు ఏమైనా ఉంటే పనిగట్టుకునైనా సరే, మాకు పంపండి. వీలు చేసుకొని ప్రచురిస్తాం.

# నీతి చంద్రిక

విగ్రహం 23

*హంసరాజు సైన్యాలన్నీ కాకి పెట్టిన చిచ్చు కారణంగా నశించాయి. చివరి కోరికగా అది తన కొడుక్కు పట్టాభిషేకం చేయమన్నది. ఇక చదవండి, నీతిచంద్రికలో 'విగ్రహం' చివరి భాగం...*

*మూలం: కీ.శే. కందుకూరి వీరేశలింగం, సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ*

హంసరాజు మాటలు విని సేనాని ఇట్లా అనుకున్నది- "ఎంతవాడైనాగానీ చావునుండి తప్పించుకోలేడు. ఏనాటికైనా ఈ శరీరం అనేది మట్టిపాలు కావలసిందే. అస్థిరం అయిన ఈ శరీరం కోసం సుస్థిరం అయిన కీర్తిని కోల్పోయేదెందుకు? 'యజమాని చెప్పిన పనిచేస్తూ చనిపోయినసేవకుడు పుణ్యలోకాలకు వెళ్తాడు' అని పెద్దలు అంటారు. ఈ శరీరం ఎప్పటికైనా పోవలసినదే కదా, దీనిని ఇప్పుడే విడిచేందుకు భయం ఏల? ప్రభువుకోసం ప్రాణత్యాగం చేసి కీర్తినొందెదనుగాక. ఏనుగు చెవుల అంచులు అనుక్షణం కదులుతూ ఉండేటట్లు, సంపదలనేవి ఎల్లప్పుడూ చంచలంగా

ఉంటాయి. ఇక శరదృతువులో మెరిసే మెరుపులవంటివి ఈ శరీరాలు. ఈ యవ్వనం అనేది నీటి అలల మాదిరి అశాశ్వతమైనదే. నిన్న చూసినవాడు ఇవ్వాళ కానరాడు. మనం ఉన్నా-పోయినా, మన పేరుమాత్రం పోకుండా నిలుస్తుంది.

ఏ రకంగా చూసినా ప్రభువులవారు రక్షణీయులే. 'ప్రభువు, మంత్రి, మిత్రుడు, ధనాగారము, రాజ్యము, కోట, బలం' అనే ఏడు అంగాలలోనూ ముఖ్యమైనవాడు రాజే. మిగిలినవి ఎంత బలంగా ఉన్నప్పటికీ, రాజు అన్నవాడే లేనప్పుడు అవేవీ నిలువవు. దేవ వైద్యుడు ధన్వంతరి కూడా ఆయువు మూడినవాడికి ఏం వైద్యం చేయగలడు? పద్మం సూర్యునిపై ఆధారపడినట్లుగా, లోకమంతా రాజుయొక్క క్షేమము-దీనత్వములను అనుసరించి అభివృద్ధి చెందటమో, నాశనమవ్వటమో జరుగుతూంటుంది..." అని అది ఇంకా ఏదో అనుకుంటూండగానే చిత్రవర్ణుడి సేనాపతి అయిన తామ్రాచూడుడు తన కోడిపుంజుల సేనతో వాళ్లమీదికి వచ్చి పడింది.

కోడికి, హంసకు అప్పుడు భయంకరమైన యుద్ధం జరిగింది. వెల్లువలెత్తిన శౌర్యంతో, గెలుపునొందే తలపులతో అవిరెండూ ఘోరంగా పోరాడాయి. రెండూ వెనుకకు జరిగి, మళ్ళీ ముందుకు దూకి, ఎగిరి, కాళ్ళతో శత్రువుని అదరకొట్టినట్లు చరచి, అరుస్తూ పరుగెత్తి వచ్చి, ముక్కును ముక్కుతో పొడిచి, రెక్కలతో మోది, శత్రువు శరీరాన్ని చింపుతూ, వాడి గోళ్లతో శత్రువు ఒంటిని రక్కుతూ, నెత్తురుతో రెండింటి శరీరాలూ ఎర్రబడగా, రెక్కలుగల మహా

పర్వతాలమాదిరి, అవి రెండూ ఆకాశానికి ఎగిరినాయి.

వాటి రెక్కలకు అయిన గాయాలనుండి భోరునకారే రక్తం మేఘాలనుండి కురిసే నీటిజల్లుని పోలింది. ఆ విధంగా హంస-కోడి ఒకదానినొకటి లక్ష్య పెట్టక, చాలాసేపు యుద్ధంచేసి , తిరిగి నేలమీదకు దూకి - ఇట్లా వెనుకంజ వేయకుండా కొంతసేపు పోరాడినాయి.

అటుపైన అంతకంతకూ హంసరాజు శక్తి సన్నగిల్లుతూ వచ్చింది. దాన్ని గమనించిన కోడిపుంజుల నాయకుడు తనది పైచేయికాగా, మెరుపు మెరిసినట్లు హిరణ్యగర్భుడిమీదకి దూకి తన రెక్కలతో హంస తలను గట్టిగా మోదింది. ఆ తాకిడికంటే శత్రువు నవ్విన నవ్వు చిచ్చులాగా హంసరాజు మనసును దహించింది. జూలును పీకినప్పుడు సింహానికి ఎంత కోపం వస్తుందో ఆ సమయంలో హంసరాజుకు అంత కోపం వచ్చింది.

ఆ కోపంలో అది తన దగ్గరలో ఉన్న శత్రుసైన్యాన్ని కొందరిని తటాలున చంపివేసింది. అంతలో కోడిపుంజు హంసను ఎగిరి తన్నడంతో అది పల్లటీలుకొట్టి దిగ్గున సంభాలించుకున్నది. క్రోధంతో దాని కనుబొమలు ముడిపడ్డాయి. తోక రెక్కలు మెలిపడ్డాయి. మెడ సాగింది. వేటుపడ్డ పామువలె రొప్పుతూ అది లేచినిలబడేందుకు ప్రయత్నించింది.

దాన్ని చూసి శత్రుసేనాపతి అయిన వీరవరుడు రోషంతోటీ, క్రోధంతోటీ పరుగున వచ్చి మెరుపులు మెరిసే చూపులు అతనిపై నిలిపి, మీదికి దూకి తన ముక్కుతో పొడిచి, గోళ్ళతో రక్కి, కాళ్లతో తన్ని చివరకు దానిని మట్టి కరిపించింది. ఆ విధంగా కోడికి సహాయంగా

దాడిచేసిన వీరవరుడిని చూసి ఆ హంసరాజు భయం ముప్పిరికొనగా ప్రాణాలమీద తీపితో పారిపోయి, నీళ్ళలోకి దూకింది.

ఆ విధంగా తమ యుద్ధం అంతా వృధా అవటాన్నీ , తమ హంసరాజు ఓడిపోవటాన్నీ గమనించిన సారసపక్షి(సేనాపతి) కోపంతో పెచ్చురిల్లింది. శత్రుమూకలన్నీ ఆవేశంగా చుట్టుముట్టినా లెక్కచేయక, ప్రళయకాలంలో దారుణ మారణకాండకు కారణమైన యమునిలాగా మహా కోపంతో ఉగ్రమూర్తి అయి అనేక పక్షులను యమపురికి పంపించింది.

చూసినవారంతా మెచ్చుకునేట్లు, ఏటికి ఎదురీదినట్లు అట్లా చిత్రవర్ణుడి సైన్యాన్ని ఎదుర్కొని, వీరవిహారం చేసి, శత్రువులకు చూడ శక్యం కానిదై, రణరంగమంతటా కొవ్వూ-మాంసాలు చెల్లాచెదరుగా పడేటట్లు చేసి, రక్తపుటేరులు పారించింది. ఆ విధంగా, వెన్ను చూపక, యముడు ఆడించే యంత్రపు బొమ్మలవంటి శత్రుమూకలను సింహబలంతో పీనుగులు గావించి, ఎదురులేక సంచరించింది.

ఆ విధంగా చావగా మిగిలిన పక్షుల గుంపులు భయంతో వెనుకకు పారివచ్చి, తన వెనుక దాగటం, అన్ని దిక్కులా తన సైన్య సమూహాలు చచ్చిపడినవీ, చచ్చిన వాటి వలే పడి ఉన్నవీ అవ్వటం చూసి, విచారపడి, నెమలిరాజు తానే స్వయంగా సేనలను పురికొల్పి ముందుండి నడిపించింది.

ఒక్కసారిగా నెమలీ, దాని మంత్రీ బెగ్గురుపక్షి పైకి దూకి, దాని శక్తిని హరించినాయి. చేవ తగ్గినా పౌరుషము తగ్గని ఆ సేనాని ఇంకా

వేలాది శత్రువులను సంహరించి, తన శక్తి పూర్తిగా సన్నగిల్లగా, తూగుతూ, అరకన్నులతో, కొసప్రాణంతో నేలమీద పడిపోయింది. అప్పుడు ఆ నెమలిరాజు పురివిప్పివచ్చి, తన రెక్కలతో, కాళ్ళతో వీరవరుడిని మొత్తింది. దాంతో వీరవరుడి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయి అది వీరమరణం చెందింది. చిత్రవర్ణుడు మహదానందంతో సింహనాదం చేసింది.

ఆ విధంగా చిత్రవర్ణుడు విజయంతో సమకూరిన ఉల్లాసంతో ప్రకాశిస్తూ, శత్రువులకోటలోకి ప్రవేశించి, రాచనగరునంతటినీ కొల్లగొట్టింది. మనసుల్లో వెల్లివిరిసిన సంతోషం ముఖాలవరకూ ప్రకాశింపచేయగా, సంతోషంతో ఉబ్బినదై "జయ జయ" రావాలు భూమ్యాకాశాలను నింపివేయగా, తన మంత్రులనూ, సైన్యాన్నీ వెంటపెట్టుకొని రోజూ ఆగకుండా ప్రయాణిస్తూ తన రాజధానిని చేరింది.

అటుపైన తాను అతి కష్టం మీద సంపాదించుకున్న విజయం సార్ధకమయ్యేటట్లు, అంతులేని సంతోషంతో రాజ్యాన్ని పరిపాలిస్తూ సుఖంగా ఉన్నది.."

-అని విష్ణుశర్మ పక్షి జాతులకు మధ్య జరిగిన యుద్ధాన్ని ఆసాంతం వివరించి, "యువరాజులారా, యుద్ధం అన్నది ప్రజలందరికీ ప్రళయంతో సమానమైన వినాశనాన్ని తెచ్చిపెడుతుంది. కాబట్టి, ఏనాడూ మీకై మీరు యుద్ధానికి కాలు దువ్వకండి. ప్రజలను ఆపదలపాలు చేయక, బాధలకు గురిచెయ్యక, నేర్పుతో పరిపాలన సాగించండి!" అనిబోధించాడు.

రాజపుత్రులు ఈ కథ విని, అంతులేని సంతోషంతో విష్ణుశర్మను పలువిధాలుగా కొనియాడారు.(కందుకూరి వీరేశలింగం రచించిన నీతిచంద్రికలో 'విగ్రహం' అనే నాల్గవ అధ్యాయం ముగిసింది. ఐదవ భాగమయిన 'సంధి' వచ్చేసారి చూద్దాం..)

మిరియగింజ చూడ మీద నల్లగ నుండు
గొరికి చూడ లోన జురుకు మనును
సజ్జనులగు వారి సారమిట్లుండుర
విశ్వదాభి రామ వినురవేమ

భావం: మిరియపు గింజ చూసేందుకు నల్లగా ఉంటుంది. దాన్ని కొరికి తింటే నాలుక చురుక్కుమంటుంది కూడా. కానీ అది చాలా మేలు చేసే వస్తువు! అలాగే, మన ఈ ప్రపంచంలో మంచివాళ్ళు కూడా ఆ మిరియపు గింజ లాంటివారే. పైకి కఠినంగాను, ఘాటుగాను కనిపించినా, వారు మేలే చేస్తారు.

నేరనన్నవాడు నెరజాణ మహిలోన
నేర్తునన్నవాడు నిందజెందు
ఊరకున్నవాడె యుత్తమయోగిరా!
విశ్వదాభి రామ వినురవేమ

భావం: 'నాకు తెలియదు' అని పనినుండి తప్పించుకునేవాడు 'మోసగాడు- అతి తెలివి వాడు' అనిపించుకుంటాడు. 'నేర్చుకుంటున్నా' అంటూ చేసేవాడు తప్పులు చేసి, నిందల పాలవుతాడు. ఏమీ అనకుండా పని చేసినవాడే ఉత్తముడు.

మంచి పద్యం

పలుమరు సజ్జనుండు ప్రియ భాషల పల్కు- కఠోర వాక్యముల్
పలుక డొకానొకప్పు డవి పల్కిన గీడును గాదు నిక్కమే-
చలువకు వచ్చి మేఘుడొక జాడను దా వడగండ్ల రాల్చినన్
శిలలగునొటు? వేగిరమె శీతల నీరము గాక భాస్కరా?!

భావం: ఒక్కోసారి మేఘాలు వడగళ్ళను రాల్చినా, అవి కరిగి చల్లని నీళ్ళయి మనకు మేలు చేస్తాయి తప్ప, రాళ్ళవ్వవు. అలాగే మంచివాడు కూడా ఒక్కోసారి కఠినంగా మాట్లాడతాడు- దాని వల్ల ఇతరులకు మేలే జరుగుతుంది తప్ప, కీడు జరగదు.

# సోమరిపోతు విజయం

*'అబ్బ! నా సోమరితనమూ ఇలా వదిలితే ఎంత బాగుండు' అనిపిస్తున్నది కదూ..? ఆశ..దోశ..!*
*రచన: బి. హేమంత్, 6 వ తరగతి, నారాయణ టెక్నోస్కూల్, విజయవాడ.*
*సాయం: బి. వైష్ణవి, 8 వ తరగతి.*

గంగినపల్లిలో నివసించే సోమిరాజుకు శరీరం అయితే బాగా బలంగా పెరిగింది గానీ, వాడికి మా చెడ్డ బద్ధకం. కోరి ఏ పనీ చేసేవాడు కాదు. పుట్టగానే తండ్రి చనిపోవటం; 'తండ్రి లేడు గదా' అని, తల్లి వాడిని అతి గారాబం చేయటం జరిగింది. ఆ అతి గారాబం వల్ల వాడు ఇట్లా సోమరిపోతుగా తయారయ్యాడు.

వాడి సోమరిపోతు తనం గురించి ఎన్నో కథలు ప్రచారంలో ఉండేవి. 'సోమరిపోతుల రారాజు' అని, వీలైతే కొన్ని సంవత్సరాల వరకు వాడు ఒక్క అడుగు కూడా క్రింద వేయకుండా బ్రతుకుతాడనీ రకరకాలుగా చెప్పుకునేవాళ్ళు అంతా.

వాడి సోమరిపోతుతనం గురించి తెలుసుకున్న రాజుగారు, ఒకరోజు వాడిని పిలిపించారు. "ఎందుకలా సోమరిగా కూర్చుంటున్నావు? ఏదైనా పని చెయ్యాలి. నేను నీకు చక్కని పని ఒకటి ఇస్తాను- చేస్తావా?" అని అడిగారు.

సోమరిపోతుకి ఏం చెప్పాలో తోచలేదు. రాజుగారి మాటను తీసెయ్యటం ఎలాగ? అందుకని వాడు నీళ్ళు నములుతూ "మా అమ్మను అడిగి చెపుతా" అన్నాడు. రాజుగారు నవ్వారు. "మీ అమ్మే నాయనా, నీకు పని ఇమ్మన్నది! ఇప్పుడు చెప్పు, ఏం పని చేస్తావో" అన్నారు.

" 'సోమరిపోతు పని' లాంటిది ఏదైనా ఉంటే ఇప్పించండి" అని అడుగుదామనుకున్నాడు సోమిరాజు. కానీ ఏం సమస్యో గాని, వాడి నోరు పెగలనే లేదు!

"సరే, నువ్వేమీ తేల్చుకోలేకుండా ఉన్నావు గనక, నీకు తగిన ఉద్యోగాన్ని మేమే నిర్ణయిస్తాం- నువ్వు ఈ రోజు నుండి మా సైనికుడివి" అని రాజుగారు వాడిని తన సైన్యంలో చేర్చుకున్నాడు. సైన్యాధికారి వాడికి ఒక గుర్రాన్ని చూసుకునే బాధ్యతను అప్పగించాడు-"నీకు నచ్చిన గుర్రాన్ని నువ్వే ఎంపిక చేసుకో" అని.

సోమరిపోతు సోమిరాజు ఆలోచించాడు: "గుర్రాన్ని చూసుకోవటం అంటే మామూలు సంగతి కాదు. పైగా యుద్ధాలు అవీ వచ్చినప్పుడు వాటివెంట మనమూ పోవాల్సి వస్తే కష్టం. ఆ కష్టం నుండి తప్పించుకోవాలంటే ఇప్పుడు వీలైనంత చెత్త గుర్రాన్ని ఎంపిక చేసుకోవాలి. ఏదైనా కుంటి గుర్రం దొరుకుతుందేమో చూస్తాను. దాన్నే ఎంపిక చేసుకుంటాను.." అని.

రాజుగారి గుర్రాల శాలలో వాడికి ఖచ్చితంగా అలాంటి గుర్రమే ఒకటి కనబడింది. ఒక కాలును పైకి ఎత్తి గడ్డి మేస్తున్నదది. దాన్ని చూడగానే సోమిరాజు ముఖం వికసించింది. వెంటనే దాన్ని ఎంచుకున్నాడు.

అతనినే గమనిస్తున్న రాజుగారి అశ్వపాలకుడు వెంటనే రాజుగారికి కబురు పంపాడు: "మహాప్రభూ! ఇతను సామాన్యుడు కాడు. అన్ని చెత్త గుర్రాల నడుమ, వాడు మన పంచకల్యాణినే ఎలా ఎంపిక చేసుకోగలిగాడో నాకు అంతు చిక్కకుండా ఉంది!" అని. నిజంగానే అది గొప్ప మేలుజాతి గుర్రం మరి!

అది విన్న రాజుగారికి చాలా సంతోషం వేసింది. అందరూ సోమరిపోతు అనుకునే సోమిరాజు ఏమంత తెలివిలేని వాడు కాదనీ, అవకాశం ఇస్తే బాగా అభివృద్ధిలోకి రాగలడనీ ఆయనకు నమ్మకం కుదిరింది.

అంతలోనే పొరుగు దేశపు రాజు ఒకడు వారి రాజ్యం మీదికి దండెత్తి వచ్చాడు. ఇరు రాజ్యాలకూ యుద్ధం మొదలైంది. సైనికులందరికీ యుద్ధంలో పాల్గొనమని ఆదేశాలు అందసాగినై. ప్రతి సైనికుడూ వ్యక్తిగతంగా సైన్యాధికారిని కలిసి, తన వంతు ఆదేశాలను స్వయంగా అందుకోవలసి ఉంటుంది.

సోమిరాజుకు భయం వేసింది. "తన కుంటి గుర్రాన్ని తను ఎక్కేది ఎన్నడు, అది తనను సైన్యాధికారిని కలిసేది ఎన్నడు? యుద్ధం చేసేదెన్నడు?" అనుకొని, వాడు అందరికంటే వెనుక బయలుదేరి, అలస్యంగా గుర్రం ఎక్కాడు.

అటు వాడు ఇంకా ఎక్కాడో లేదో, పంచకళ్యాణి పరుగులు పెట్టింది. గబగబా

సైన్యాధికారి ముందుకు పోయి నిలబడింది. మిగిలిన గుర్రాలన్నీ తప్పుకొని దానికి దారి వదిలాయి!

సోమిరాజుకు దిక్కుతోచలేదు. వాడికి తెలివి వచ్చేంతలో వాడు సైన్యాధికారి ముందు నిలబడి ఉన్నాడు. సైన్యాధికారి వాడిని మెచ్చుకొని, వెయ్యి మంది సైనికులను ముందుండి నడిపే బాధ్యతను అప్పగించాడు.

సోమిరాజు ఏడుపు ముఖం పెట్టుకొని తన గుర్రం ఎక్కీ ఎక్కగానే అది ఈసారి నేరుగా యుద్ధభూమికే పరుగు పెట్టింది. గుర్రాలన్నింటికంటే ముందుకు ఉరికింది. దాన్ని చూసి మిగిలిన గుర్రాలన్నీ వేగం పెంచి దాన్ని అనుసరించాయి.

సోమరిపోతు హడలిపోయాడు. ఎలాగైనా గుర్రం మీది నుండి కిందికి దూకేయాలనుకున్నాడు. వెంటనే గుర్రాన్ని సన్నగా, పొడవుగా ఉండే రెండు తాటి చెట్ల మధ్యకు పోనిచ్చాడు. "రెండు చెట్లనూ తన రెండు చేతులతో పట్టుకుంటే గబుక్కున గుర్రం దిగిపోవచ్చు" అనుకున్నాడు వాడు.

అయితే సోమిరాజు అలా ఆ చెట్లను పట్టుకోగానే, అవి రెండూ ఊడి అతని చేతుల్లోకి వచ్చేసాయి! మరుక్షణం అతని వెనక ఉన్న సైనికులందరూ కత్తులు, బల్లేలు పైకెత్తి "జయహో! శతృ కర్షణ సోమిరాజ బహద్దూర్‌కీ, జై!" అని అరిచారు.

అది చూసిన శత్రు సైన్యం వాళ్ళు,అంత బలవంతునితో యుద్ధం చెయ్యడం తమవల్ల కాదని భయంతో అక్కడినుండి పారిపోయారు!

రాజుగారు తక్షణం సోమరిపోతు సోమిరాజుకు సైన్యాధికారిగా పదోన్నతి కల్పించారు. సోమిరాజుకు "సోమిరాజ బహద్దూర్" అని బిరుదుకూడా ఇచ్చారు!

దాంతో సోమిరాజుకు ఎంత అయిష్టం అయినా ఇక సైన్యంలో మరింత పని చేయక తప్పింది కాదు. పనిలో పడి-పడి, క్రమంగా వాడి సోమరిపోతుతనమూ పూర్తిగా వదిలింది!

# పెద్దల మాట

'పెద్దల మాట-చద్ది మూట' అని సామెత. 'పెద్దవాళ్ళు చెప్పిన మాట వినాలి' అని. కానీ మరి, నిజంగా ఎప్పుడూ పెద్దవాళ్ళు చెప్పిన మాట వినాల్సిందేనంటారా...?

రచన: సి. మీనాక్షి, 8 వ తరగతి, ప్రతిభ మోడల్ స్కూల్, జహీరాబాదు.

సౌజన్యం: మన లైబ్రరీ, జహీరాబాదు

అనగా అనగా ఒక అడవి ఉండేది.

ఆ అడవిలో ఓ పెద్ద చెట్టు ఉండేది.

ఆ చెట్టుకో తొర్ర ఉండేది.

ఆ తొర్రలో ఒక ముసలి గుడ్లగూబ ఉండేది.

అది చాలా మంచిది, తెలివైనది. అందరికీ సాయం చేసేది.

ఆ అడవిలో లెక్కలేనన్ని పూలు ఉండేవి.

ఎన్నో కాయలు కాసేవి.

ఏ చెట్టుకు చూసినా పండ్లు, గుత్తులు గుత్తులుగా వేళ్ళాడుతుండేవి.

ఓసారి ఆ అడవిలోకి ఒక రామచిలుక వచ్చింది. అప్పటివరకూ అది పట్నంలోనే, ఎవరి ఇంట్లోనో ఓ పంజరంలో బ్రతికింది. దానికి అడవి గురించి అస్సలు ఏమీ తెలీదు.

అయితే ఆ సంగతి చెప్పుకోవాలంటే దానికి నామోషీ. తనకు అన్నీ తెలిసినట్లు నటిద్దామనుకున్నదది.

అడవిలోకి వచ్చీ రాగానే గుడ్లగూబను పలకరించింది- "ఏంటి మామా?! కులాసానా? అందరూ బాగున్నారా? నేను పట్నం నుండి వచ్చాను మిమ్మల్ని అందర్నీ చూసిపోదామని; మన అడవిలో దొరికే పళ్ళన్నీ తిందామని!" అని.

"పళ్ళన్నీ తినద్దురో అల్లుడూ!" అంది గుడ్లగూబ. "మిలమిలా మెరిసేవన్నీ మంచి పళ్ళు కాదు. ఎర్రగా బుర్రగా కనిపిస్తా ఉన్నాయని ఎగబడి తినేవు జాగ్రత్త, విషపు పళ్ళుంటాయి!" చెప్పింది.

"నాకు తెలీదా, ఆ మాత్రం?!" అంది చిలుక.

“ముసలి వాళ్లంతా ఇంతే, చాదస్తం!” అనుకున్నది చిలుక. అడవంతా తిరిగి, ఏవేవో పళ్ళు తిన్నది. “అన్నీ కొరికి చూడాలి" అనుకొని, నిజంగానే అన్నీ కొరికి చూసింది.

ఓ గంటసేపు అట్లా తిరిగి తిరిగి ఏమేం తిన్నదో- కడుపులో గడబిడ మొదలు అయ్యింది. కళ్ళు మసక బారాయి. తల తిరిగింది- దాని అదృష్టం బాగుండి, గుడ్లగూబ ఉండే చెట్టు ముందుకే వచ్చి నేలబారుగా పడిపోయింది.

"శబ్దం ఏంటా!?” అని లేచి వచ్చి చూసింది గుడ్లగూబ . ఎదురుగా నేలమీద చిలుక- గుడ్లు తేలవేసి పడి ఉన్నది.

వెంటనే అది తనకు తెలిసిన మందు ఆకులు తెచ్చి, నూరి దాని ముక్కులో పిండింది. చిలుక ప్రాణాలను కాపాడింది.

లేచి కూర్చున్న చిలుక తన అవివేకానికి సిగ్గుపడి తలవంచుకుంది. “తెలీనప్పుడు ఎవరన్నా పెద్దవాళ్ళు చెబితే వినాలిరా అల్లుడూ" అని గుడ్లగూబ అంటే "నిజమే" అనిపించింది దానికి ఇప్పుడు!

నవ్వు!

టీచరు: రాజూ, సముద్రానికీ, మహాసముద్రానికీ తేడా ఏమిటో చెప్పు?

రాజు: 'మహా' టీచర్!!

# అమ్మ కవిత

ఇంటికి, అమ్మకి దూరంగా ఉన్న ఓ చిన్న కవయిత్రి ఘోషనా ఇది?! ఏమో, ఇది చదివాక మటుకు మాకో సందేహం వచ్చింది- 'అమ్మకి బొమ్మ రైమ్ అవుతుందా, కాదా?!' అని. మీరేమంటారు?
రచన: ఎస్. శ్రీవాణి, లిల్లీ/ ఎనిమిదవ తరగతి, అరవింద హైస్కూల్, కుంచనపల్లి.



నన్ను ఈ లోకానికి పరిచయం చేసిన మా అమ్మ
నా కలల నాటకంలో ఓ ప్రధాన బొమ్మ
అమ్మను నాకు ప్రసాదించిన ఆ దైవం
మా అమ్మను నాకు అందించి, కోరికలు నెరవేర్చిన 'దివ్వెల దీపం'
నా నేస్తం మా అమ్మ, నా ప్రాణం మా అమ్మ
నాకు ఊపిరి పోసిన దేవదూత మా అమ్మ

తొమ్మిది నెలలు నీ కడుపులో దాచుకుని పోషించావు
నీ వృద్ధాప్యంలో నీకు ఆధారం అవుతానని అనుకుంటావు
వెచ్చని నీ ఒడిలో పడుకోవాలని ఉంది
కానీ ఎదిగిన వయసు, తిరిగిన కాలం నన్ను నీ ఒడికి దూరం చేశాయి.
మళ్ళీ జన్మంటూ ఉంటే, మళ్ళీ నీ పుత్తడి బొమ్మలా నే పుడతాను
మళ్ళీ మళ్ళీ నీ గారం, నీ ప్రేమ ఆస్వాదిస్తాను.

# చెట్లు - సొరతీగ

*రచన: యం. శర్వాణి, 6 వ తరగతి, శ్రీ విజ్ఞాన విహార పాఠశాల, విజయవాడ.*

అనగనగా ఒక అడవి. ఆ అడవిలో చాలా చెట్లు ఉండేవి . ఆ చెట్లల్లో సొర తీగలు, పెద్ద పెద్ద మామిడి చెట్లు ఉండేవి.

సొరతీగలు సన్నగా ఉంటాయి కదా, సోలిపోతూ? అందుకని అవి ఎప్పుడూ పెద్ద చెట్లని అల్లుకొని ఉండేవి. మామిడి చెట్లు మాత్రం గట్టిగా, బలంగా నిలబడి ఉండేవి. వాటిని చూస్తే మామిడి చెట్లకు చులకన. "మీరు ఎప్పుడూ ఇంతేనా? ఇలానే బక్కగా ఉంటారా? చిన్న గాలి వస్తే కింద పడిపోతారు!" అని ఎగతాళి చేస్తూ ఉండేవి.

సొరతీగలకి పాపం ఏం జవాబు ఇవ్వాలో తెలిసేది కాదు.

"దేవుడు మమ్మల్ని ఇట్లా పుట్టించాడెందుకో?

మామిడి చెట్లలాగా బలంగా తయారవ్వాలంటే ఏం చేయాలో!" అని అవి మౌనంగా ఏడ్చుకుంటూ ఉండేవి.

కొన్నాళ్లకు ఆ తీగలకి చక్కని అందమైన పూలు పూచాయి. ఆ పూలనుండి వచ్చే కాయల కోసం ఎదురుచూడటం మొదలు పెట్టాయి సొరతీగలు.

"అబ్బో! పిల్లలకోసం ఎదురు చూస్తున్నారా? మీ పిల్లల గురించి ఇంక ఏం అంటాంలే, మీరే ఇట్లా ఉంటే మీ పిల్లలు ఎట్లా ఉంటాయో, ఇక చెప్పినట్లే" అని దెప్పటం మొదలుపెట్టాయి మామిడి చెట్లు.

"నిజంగానే మా పిల్లలు బలహీనంగా పుడతాయేమో! మాకసలు కాయలంటూ ఏవైనా వస్తాయో, రావో" అని భయపడసాగాయి సొరతీగలు.

మెల్లగా సొర పిందెలు కాశాయి. చిట్టి చిట్టి పిందెలు..మామిడి చెట్లు వాటిని చూసి నవ్వాయి. "మేం చెప్పలేదూ? ఇంతే, బలహీనపు తల్లులు-బలహీనపు పిల్లలు!" అన్నాయి.

అంతలో పెద్ద గాలివాన వచ్చింది. ఎక్కడలేని వేగంతో గాలులు వీచాయి. భీభత్సం జరిగింది. ఎక్కడ పడితే అక్కడ విరిగి పడ్డాయి మామిడి కొమ్మలు.

సొర పిందెలు మటుకు తీగల్ని అంటిపెట్టుకొనే ఉన్నాయి. తర్వాత వారం రోజుల్లో అవి కాస్తా పెరిగి పెద్దయ్యాయి. లావుగా తయారయ్యాయి.

అటుగా ఎగురుకుంటూ వచ్చిన సీతాకోక చిలుకలు సొర పూలపై వాలి చెప్పుకున్నాయి- "సొరకాయలు ఎంత బాగా వచ్చాయో చూడు! పాపం పొగరుమోతు మామిళ్ళ

కొమ్మలన్నీ విరిగి పోయాయి. అణకువతో ఉండటం అందుకేనట, మంచిది!" అని.

అది విన్న పెద్ద చెట్లన్నీ కొమ్మలు వంచుకొని అనుకున్నాయి "నిజమే, రూపాన్ని చూసి ఎవ్వరినీ చిన్నబుచ్చకూడదు. పొగరుమోతుతనం అస్సలు మంచిది కాదు" అని.

**బెత్తెడు!**

ప్రపంచ పటాన్ని వివరించాక, సోషల్ టీచరు : రాజూ! భారత్- అమెరికాల మధ్య దూరం సుమారుగా ఎంత?

రాజు: ఆ.. ఆ... జానెడుకు కొంచెం ఎక్కువ, మూరెడుకు కొంచెం తక్కువగా ఉన్నట్లు కనబడుతోంది సార్!!

**చిలిపి!**

టీచరు: రాజూ, ఇంద్రధనస్సులో ఎన్ని రంగులుంటాయో చెప్పు?

రాజు: ఊరుకోండి టీచర్! మీకు తెలీనట్టు, అన్నీ మమ్మల్నే అడుగుతారు!!

**సామరస్యం!**

టీచరు: ప్రతీ ఆదివారం గోళ్లు కత్తిరించుకోవాలని నిన్న చెప్పాను. ఎందుకో చెప్పు టింకూ?

టింకు: పిల్లలంతా ఒకరినొకరు గీరుకోకుండా ఉండాలని కదండి టీచర్!!

**రెండు!**

టీచర్: గుర్రానికి, ఏనుగుకి తేడా చెప్పు రాజూ

రాజు: గుర్రానికి వెనుక మాత్రమే తోక ఉంటుంది, ఏనుగుకు ముందు.వెనుక తోకలుంటాయి!

**ఎన్నోసారి?**

వెంగళప్ప: బాబూ ఏం చదువుతున్నావు?

సాత్విక్: బీటెక్ నాలుగవ సంవత్సరం...

వెంగళప్ప: కనీసం ఈ ఏడాదైనా బాగా చదివి పాస్ అవుతావా?!!

# స్నేహబంధం

*కొన్ని సంఘటనలు మనకు పాఠాలు నేర్పిస్తాయి; మనసులు మారుస్తాయి- ఇదిగో, ఈ కథలోని సంఘటనలో లాగా..*

*రచన: కె.ఎ. సునీత, ఎస్.సాయిలత, ఎస్. ప్రీతి, ఆరవ తరగతి, గోల్డ్ సెక్షన్, శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, అనంతపురం.*

అనిత, స్వప్న, సృజన ముగ్గురూ మంచి స్నేహితురాళ్లు. ఒక రోజు వాళ్ళు ముగ్గురూ బడినుండి తిరిగివస్తున్నారు. అంతలో రోడ్డుమీద ఒక పాప ఏడ్చుకుంటూ కనిపించింది వాళ్లకి.

ముగ్గరూ వెళ్ళి "ఎవరు నువ్వు? ఏం జరిగింది? ఎందుకలా ఏడుస్తున్నావు?" అని అడిగారు ఆ పాపను.

"నా పేరు కవిత. నాకు ఎవ్వరూ లేరు. నేను ఆ ఇంట్లో పనిమనిషిగా ఉంటున్నాను. ఇవాళ్ళ

ఉదయం ఆ ఇంట్లోవాళ్లందరూ డబ్బులు పోయాయని వెతుకుతున్నారు. నేను బండలు కడుగుతున్నాను.

అంతలో బీరువా కింద లక్షరూపాయలు దొరికాయి నాకు! నేను వాటిని తీసుకుని అయ్యగారికి ఇవ్వబోయాను; అయితే నేనే ఆ డబ్బులు తీశానని నాపై నిందవేసి, నన్ను వెళ్ళగొట్టారు వాళ్ళు!" ఏడ్చుకుంటూ చెప్పింది కవిత.

"ఏడ్చకు కవితా, మేము నిన్ను మా ఇంటికి తీసుకవెళతాం లే. అనితా- సృజనా, నేను అనితను మా ఇంటికి తీసుకువెళతాను సరేనా?!" చెప్పింది స్వప్న, కవిత చెయ్యి పట్టుకుంటూ.

ఇద్దరూ స్వప్న వాళ్ల ఇల్లు చేరుకున్నారు.

"అమ్మా, ఈ అమ్మాయి కవిత- నా స్నేహితురాలు " స్వప్న చెప్పింది.

"నీ స్నేహితురాలా? నేనెప్పుడూ చూడలేదే?!" అడిగింది స్వప్న వాళ్ల అమ్మ.

"అవునమ్మా! కవితని ఇంతకుముందు ఎన్నడూ చూడలేదు నువ్వు. ఆ మూలమీద ఇంట్లో పనిమనిషిగా ఉండేది కవిత. తను దొంగతనం ఏదీచెయ్యకపోయినా, తన మీద ఆ నింద వేసి గెంటేశారట, ఆ ఇంటి వాళ్ళు. రోడ్డు మీద తను ఏడుస్తూ కనిపించిందమ్మా, దాంతో నాకు తనని మన ఇంటికి తీసుకు రావాలనిపించింది. "మా అమ్మ చాలా మంచిది.. ఎవర్నైనా ఇంట్లోకి పిలుచుకుంటుంది..రా" అని తనని మన ఇంటికి తీసుకు వచ్చా" చెప్పింది స్వప్న.

"ఒద్దులేమ్మా, ఇట్లా మనకు తెలీని వాళ్ళను

మనం ఇంట్లోకి పిలుచుకోకూడదమ్మా" నచ్చజెబుతున్నట్లు అన్నది స్వప్న వాళ్ళ అమ్మ.

వింటున్న కవిత ముఖం చిన్నబోయింది.

"ఇప్పుడు నువ్వు ఒద్దంటే తను ఎక్కడికి వెళుతుందమ్మా?! ఉండనియ్యి , కొన్ని రోజులు.." బ్రతిమాలుతూ అడిగింది స్వప్న.

కూతురు బ్రతిమిలాడ్డంతో ఇష్టం లేకపోయినా ఆ పాపను తమ ఇంట్లో కొద్ది రోజులపాటు ఉండనిచ్చేందుకు ఒప్పుకుంది స్వప్నవాళ్ళ అమ్మ.

***

మరునాడు స్వప్న బడికి బయలుదేరుతూ కవితను అడిగింది- "కవితా, నావెంట బడికి వస్తావా?" అని.

"నాదగ్గర డబ్బులు లేవు కదా, ఎలా వస్తాను?" అంది కవిత.

"మా బళ్ళో ముందు ఒక్కసారి మాత్రం డబ్బులు కట్టించుకుంటారు. ఆ తర్వాత మనం చదువుకుంటూ పోవచ్చు. మన చదువు పూర్తయ్యాక, మనంకట్టిన డబ్బుల్లో సగం వాళ్ళు వెనక్కి ఇచ్చేస్తారు మళ్ళీ! అందుకని ఏం పర్లేదు" అంది స్వప్న.

"మరి నావంతు డబ్బులు ఎట్లాగ?" అంది కవిత.

"మా నాన్న కడతారులే!" అంది స్వప్న.

వీళ్ళ మాటలు వింటున్న స్వప్న వాళ్లమ్మ "ఏంటే, ఏమిటి, 'నాన్న కడతారు' అని చెబుతున్నావు?" అంది.

"ఏం లేదమ్మా, కవితని బడిలో చేరమంటున్నాను; 'ఫీజు డబ్బులు నాన్న కడతారులే' అని చెబుతున్నా తను రావట్లేదు" అంది స్వప్న.

"ఒద్దులేమ్మా! తనకి చదువు వద్దులే. నువ్వు వెళ్ళు చాలు. తను మన ఇంట్లో పని చేస్తుంది" అంది స్వప్న వాళ్లమ్మ.

స్వప్న ఒప్పుకోలేదు. "పిల్లలందరూ చదువుకోవాల్సిందే అమ్మా, కావాలంటే ఎవరినైనా అడుగు.." అని మొదలుపెట్టింది. అంతలో వాళ్ల స్నేహితురాళ్ళు సృజన, అనిత వచ్చారు అక్కడికి. అందరూ కలిసి అడిగేసరికి, స్వప్న వాళ్లమ్మ అయిష్టంగానే కవితని బడికి పంపేందుకు ఒప్పుకున్నది.

***

నాలుగైదు రోజులు గడిచాయి. రోజూ కవిత కూడా స్వప్నతోబాటు బడికి వెళ్ళి వస్తోంది . ఇంటికి వచ్చాక గిన్నెలు తోమివ్వటం, ఇల్లు ఊడ్చటం, తుడవటం, వంటలో సాయం చెయ్యటం.. ఇలా చేస్తున్నది. అయినా స్వప్న వాళ్లమ్మకు తనంటే ఏమంత ఇష్టం ఏర్పడలేదు. "మన ఇంట్లో ఉంటూ బడికి కూడా పోతోంది, అది కూడా మన ఖర్చుతోటే!" అని ఉడికిపోతున్నది ఆవిడ.

***

ఆరోజున స్వప్న, కవిత, అనిత, సృజన నలుగురూ బడినుండి ఇంటికి వస్తున్నారు. దూరంగా స్వప్న వాళ్లమ్మ కనిపించింది- "ఏయ్ స్వప్నా! అదిగో, అమ్మగారు" చూపించింది కవిత. స్వప్న వాళ్లమ్మకేసి చూస్తుండగానే ఘోరం జరిగిపోయింది.. ఎదురుగా వస్తున్న బస్సొకటి స్వప్నవాళ్ల అమ్మను గుద్దేసింది! పిల్లలు నలుగురూ గబగబా స్వప్న వాళ్ల అమ్మ దగ్గరికికి పరుగు పెట్టారు. స్వప్న వాళ్లమ్మ నేలమీద పడిపోయి ఉన్నది-రక్తం కారుతున్నది. అది చూడగానే స్వప్న కళ్ళు తిరిగి పడిపోయింది. కవిత మటుకు వెంటనే తమ దగ్గరున్న జేబురుమాళ్ళతో స్వప్న వాళ్లమ్మకు కట్లు కట్టింది, సపర్య చేసింది; అంబులెన్సుకు, స్వప్న వాళ్ల నాన్నగారికి ఫోను చేయించింది; ఆస్పత్రిలో చేర్పించి వైద్యం మొదలు పెట్టించింది. అందరూ ఆ పాప చొరవను, ధైర్యాన్ని ప్రశంసించారు.

స్వప్న వాళ్లమ్మకు మరునాటి రోజునగానీ తెలివి రాలేదు. మరి కొన్నాళ్ళు ఆవిడ ఆసుపత్రిలోనే ఉండాల్సి వచ్చింది. ఆ మూడు నాలుగు

రోజులూ కవిత పెద్దమ్మాయిలాగా ఇంటిని నిర్వహించటమే గాక, ఆస్పత్రికి కావలసిన వస్తువులన్నిటినీ కూడా సమయానికి అందేట్లు చూసింది. ఇంటికి వచ్చాక స్వప్న వాళ్లమ్మ కవితకు థాంక్స్ చెప్పింది- "నీ రుణం ఎన్నటికీ తీర్చుకోలేనమ్మా! ఇన్ని రోజులూ నిన్ను చిన్న చూపు చూశాను. నన్ను క్షమించు" అన్నది.

"అదేంటమ్మా! మీరు నాకు ఉండటానికి చోటిచ్చారు; బడికి పంపుతున్నారు- అంతకంటే ఇంకేం కావాలి నాకు?" అన్నది కవిత.

అటుపైన కవిత వాళ్ళింట్లో ఒక భాగం అయిపోయింది. కవిత, స్వప్నల స్నేహ బంధం కలకాలం నిల్చింది.

నవ్వండి!

**పొదుపు!**

మేనేజర్: ఏంటయ్యా ఆఫీసులో సమయం వృధా చేయకూడదని చెప్పానుగా!

వెంగళప్ప: అందుకే సార్ గడియారంలో బ్యాటరీ తీసేశా!!

**ఒకరికోసం ఒకరు!**

రామయ్య: నీకోసం మీ ఆవిడ పూజలు చేస్తుందటకదా! మరి ఆవిడకోసం నువ్వేం చేస్తున్నావు బాబూ?

ప్రసాద్: అప్పులు!

**చక్కని సమాధానం!**

టీచరు: మెదడువాపు వ్యాధి గురించి మనం ఎందుకు పట్టించుకోవాలి?

హరి: మనకు మెదడుంది కదా, టీచర్?... అందుకే!!

**మరేం!**

పళ్ల డాక్టరు: మీ ఇంట్లో ఏం పేస్టు వాడతారు?

వెంగళప్ప భార్య: అల్లం వెల్లుల్లి పేస్టు డాక్టర్!

# పేదవారి బతుకులు

*మన చుట్టూ పేదరికం ఎందుకున్నది ? దాన్ని నివారించేందుకు మనం ఏం చెయ్యాలి...? ఈ కథ కాని కథలో సమాధానాలు లేవు. మనమే ఆలోచిద్దాం మరి...!*

*రచన: కె. జగదీష్, 8 వ తరగతి, మోడల్‌స్కూల్, చెన్నేకొత్తపల్లి.*

మా ఊళ్ళో ఒక పేదాయన ఉండేవాడు. అతనికి కనీసం ఒక పూట భోజనం పెట్టేవారు కూడా ఎవ్వరూ లేరు. పైగా అతను ఎప్పుడు చూసినా అనారోగ్యంతో చాలా కష్టంలో ఉండేవాడు. తన శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఏమీ చేయలేక, అష్టకష్టాలు అనుభవిస్తూండేవాడు.

అందరూ అతన్ని అసహ్యించుకునేవాళ్ళు. ఎవ్వరూ అతనుండే గుడిసె ముందు అడుగుకూడా పెట్టేవారుకాదు. అతని దగ్గరికెళ్లి ఒక మాట మాట్లాడేవాళ్ళు కూడా ఎవ్వరూ లేరు అక్కడ.

అతన్ని చూసినప్పుడల్లా నాకు చాలా బాధ

కలిగేది. అప్పుడే నాకు అర్థమయ్యింది- 'పేదవారంటేనూ, వాళ్ళ బతుకులంటేనూ ఇలా ఉంటాయి' అని.

"ఓ దేవుడా! ఎందుకయ్యా, ఇలా సృష్టించావు వీళ్లని?" అని దేవుణ్ణి ప్రశ్నించాను నేను.

"నేను కాదుగా, వీళ్ళని ఇలా తయారు చేసుకున్నది మీరే. మీ సమాజంలో లోపాలన్నీ మీరు స్వయంగా సృష్టించుకున్నవే! మీకు మీరే బాధ్యులు" అన్నాడు దేవుడు గాలిలోంచి మాట్లాడుతున్నట్లు.

"ఇలాంటివారి కోసం ఎవరూ ఏమీ చెయ్యలేరా? పేదలు ఇంత కష్టం అనుభవించాల్సిందేనా? ప్రభుత్వాలు ఏమీ చెయ్యలేవా, ఇట్లాంటి వారికోసం?" అని అనేక ప్రశ్నలు వచ్చాయి నాకప్పుడు.

"అప్పుడే నాకు అనిపించింది - బాగా చదువుకోవాలని; మంచి ఉద్యోగం సంపాదించి, పేదవారికోసం ఏదైనా చెయ్యాలని!"

అప్పటినుంచీ నేను బాగా కష్టపడి చదివాను. పెద్ద ఉద్యోగం సంపాదించాను. పేదవాళ్ళకు నా వంతు సాయం చేశాను.

**చిలిపి ప్రశ్నలు!**

ప్రశ్న: ఇంద్రధనస్సులో చివరిది ఏది?

జవాబు: 'స్సు'

ప్రశ్న: ఎన్నికల్లో ప్రత్యర్థిని ఓడించాలంటే ఏం చేయాలి?

జవాబు: గెలవాలి!

# పుస్తకాలు చదవటం కథ

*పూజ చదువుకు ఏం అడ్డం వచ్చిందో చూశారుగా? టివి! మరి అది మీ చదువులకు కూడా అడ్డం రావట్లేదు కద..?*
*రచన: పూజారాజ్, ఆరవ తరగతి, వికాస విద్యావనం, పోరంకి.*

అనగనగా ఒక ఊళ్లో పూజ అనే అమ్మాయి ఉండేది. ఆ ఊరి బళ్లో చదువుకునేది ఆ పాప.

ఆ పాపకు పుస్తకాలు చదవటం అంటే మహా ఇష్టం. కానీ వాళ్ల అన్నకూ, అమ్మా నాన్నలకు మటుకు పుస్తకాలంటే అంతగా ఇష్టం ఉండేది కాదు. అయితే పూజకు పుస్తకాలపట్ల ఉన్న ఇష్టాన్ని గమనించి, వాళ్ల బడిలోని ఉపాధ్యాయుడు ఒకాయన ఆ పాపకు ప్రతివారమూ కొన్ని పుస్తకాలు ఇంటికి ఇచ్చేవాడు.

అయినా పూజ పుస్తకం చదవటం

మొదలుపెట్టేసరికి వాళ్ళ అమ్మ "తర్వాత చదువుకోవచ్చులేమ్మా!" అంటూ ఆ పనులకూ, ఈ పనులకూ పిలిచేది. అవన్నీ పూర్తి చేసి పుస్తకం తెరిచే లోపు, పూజ వాళ్ళ అన్న టీవీ శబ్దాన్ని బాగా పెంచి టీవీ చూసేవాడు.

ఇక పూజకు పుస్తకాలు చదివేందుకు వీలయ్యేది కాదు! చివరికి చదివే సమయం చిక్కక, తను తెచ్చుకున్న పుస్తకాలను చదవకుండానే మాస్టారికి ఇచ్చెయ్యాల్సి వచ్చేది పాపం.

కొన్నిసార్లు అట్లా జరిగాక, ఒకనాడు పూజ తన కష్టాన్ని వాళ్ళ ఉపాధ్యాయుడితో చెప్పుకున్నది. మాస్టారు ఒక ఉపాయం ఆలోచించారు. తన పథకం ప్రకారం మొదట పూజ వాళ్ల అన్నకు పుస్తకాలపట్ల ఇష్టాన్ని పెంచాడు ఆయన. త్వరలోనే పూజ వాళ్ల అన్న కూడా బడి నుంచి పుస్తకాలను ఇంటికి తీసుకెళ్ళటం మొదలుపెట్టాడు. అప్పుడు పూజ కావాలని టీవీ సౌండు బాగా పెంచి పెట్టటం మొదలు పెట్టింది. వాళ్ల అన్నని అస్సలు చదువుకోకుండా చేసింది.

దాంతో పూజ వాళ్ల అన్నకు తెలిసి వచ్చింది- చదువుకుంటున్న సమయంలో టీవీ శబ్దం ఎక్కువగా ఉంటే చదువుకోవడానికి ఎంత ఇబ్బందో! ఇక అప్పటినుండి అతను మారిపోయాడు- ఇప్పుడు అసలు టీవీ పెట్టటమే మానేశాడు. ఎప్పుడన్నా టివి పెట్టినా, తక్కువ శబ్దంతో, పూజకు ఇబ్బంది కలగకుండా పెట్టటం అలవాటు చేసుకున్నాడు.

అంతే కాదు, ఇప్పుడు అతనికి కూడా పూజలాగా పుస్తకాలు చదవటం

అలవాటయింది కదా, వాళ్ల అమ్మకు కూడా ఆ విషయం చెప్పాడు- చదువుకునేటప్పుడు మధ్యలో పిలవొద్దనిచెప్పాడు!

"మరి మీరు పనులు ఎట్లా నేర్చుకుంటారు రా?" అన్నది అమ్మ.

"అప్పుడప్పుడు మేమే వచ్చి సహాయం చేస్తాంలే" అని అన్న, పూజ ఇద్దరూ అట్లా మధ్య మధ్యలో వాళ్ళే వెళ్ళి అమ్మకు ఇంటిపనిలో సాయం చేయటం మొదలు పెట్టారు.

అట్లా పూజ బాధ తీరింది. అప్పటినుండీ ఆ పాప మంచి మంచి పుస్తకాలు చదువుతూ, చాలా విషయాలు తెలుసుకుని గొప్ప రచయిత్రి అయ్యింది. చాలా పేరు సంపాదించుకున్నది.

మీకు ఈ పుస్తకం నచ్చిందా? మరైతే దీన్ని వృధా పోనివ్వకండి. మీదగ్గరున్న పుస్తకాలను మీ స్నేహితులతో తప్పకుండా పంచుకోండి. 'పుస్తకాలు పంచుకోవటం' బలే బాగుంటుంది! దానివల్ల అందరికీ లాభమే మరి!

కొత్తపల్లి కథల పుస్తకాల్లోని కథలన్నిటికీ “క్రియేటివ్ కామన్స్ వారి షేర్ అలైక్-నాన్ కమర్షియల్ లైసెన్సు”వర్తిస్తుంది. అంటే దానర్థం, వ్యాపారం కాకుండా మరేదైనా పనికోసమైనంతవరకూ ఎవరైనా సరే- వీటిని చక్కగా ఉపయోగించుకోవచ్చు, పంచుకోవచ్చు, చెప్పుకోవచ్చు, చదువుకోవచ్చు, చదివించవచ్చు, మార్చేసుకోవచ్చు, అనువదించుకోవచ్చు, కావాలంటే ముద్రించుకోవచ్చు! కేవలం ఆయా రచయితలకో, కొత్తపల్లికో 'సౌజన్యం' వ్యక్తం చేస్తే చాలు. మన ప్రాచీన కావ్యాలు, రచనలు అన్నీ ఈ స్ఫూర్తితో చేసినవే కదా. అందుకని మీరు చేసే ఇతర రచనలన్నిటికీ కూడా ఇలాంటి లైసెన్సునే ఇవ్వండి!
పూర్తి వివరాలకోసం సందర్శించండి: http://creativecommons.org/

# సాహసబాలలు

*సాహసం అనేది కావాలని అలవరచుకుంటే రాదా..? ఇదిగో మరి, ఈ కథలో లాగా అప్రయత్నంగానే వస్తుందా..? ఏమో, మీరే చెప్పండి.*

*రచన: బి. నాగార్జున, పాలపిట్ట బాలల సంఘం, చెన్నేకొత్తపల్లి,*

సుబ్బరాయునిపల్లిలో మారుతి, అనిల్ అనే అల్లరి పిల్లలు ఇద్దరు ఉండేవాళ్ళు. ఇద్దరూ అల్లరి పిల్లలే గానీ, బలే తెలివైనవాళ్ళు. ఇతరుల పట్ల మర్యాదగానూ, సమాజంపట్ల బాధ్యతతోనూ ఉండేవాళ్ళు కూడా.

సుబ్బరాయునిపల్లిలో బడి ఐదో తరగతి వరకే ఉంది. ఆరవ తరగతి చదవాలంటే దగ్గర్లో ఉన్న ధర్మవరానికి వెళ్లాల్సిందే. ఆ సంవత్సరం మారుతి, అనిల్ ఇద్దరూ ఆరవ తరగతికి వచ్చారు- రోజూ ధర్మవరం వెళ్ళి, రావాలి. మిత్రులిద్దరూ రోజూ ధర్మవరం వెళ్ళేవాళ్ళు- అయితే ఈ మధ్య రోజూ వాళ్ళు వెళ్తున్నది

బడికి కాదు! బడికి బదులు, సినిమాలకి-షికార్లకు పోవటం మొదలు పెట్టారు! మెల్లగా చెడు మార్గం పట్టారన్న మాట!

ఒక రోజున వాళ్ళిద్దరూ సినిమా హాలువైపుకు నడిచిపోతున్నారు. దారంతా ఏవేవో బ్యానర్లు కట్టి ఉన్నాయి. ఐదారు పోలీసు వాహనాలు కూడా వాళ్ళకు ఎదురయ్యాయి.

ఒక వాహనం అయితే వాళ్ళకు చాలా దగ్గరనుండి దూసుకు పోయింది. అన్ని పోలీసు వాహనాల్ని చూసిన మారుతి కొంచెం కంగారుపడి, పక్కనే ఉన్న మురికి కాలువలోకి జారిపడబోయాడు!

అయితే వెంటనే తేరుకుని పైకి ఎక్కి, పక్కనే ఉన్న మోరీవైపు చూశాడు మారుతి. అక్కడ రంగు రంగుల వైర్లు ఉన్న గుండ్రటి వస్తువు ఒకటి, మెరుస్తూ కనబడింది అతనికి. వాడు కొద్దిసేపు అక్కడే నిలబడి దానికేసే ఆశ్చర్యంగా చూశాడు. వాడిని చూసి అనిల్ కూడా అక్కడికి వచ్చి నిలబడ్డాడు- ఇద్దరూ మోరీ చివర్న బురద అంటుకొని ఉన్న ఆ వస్తువునే చూస్తూ నిలబడ్డారు.

అంతసేపూ ఆ పక్కనే ఉండి, వీళ్ళిద్దరినీ గమనిస్తున్న వ్యక్తి ఒకడు, వీళ్ళిద్దరూ అలా ఆశ్చర్యంగా నిలబడిపోగానే ఎవరికో ఫోన్ చేశాడు. క్షణాల్లో ఒక జీపు అక్కడికి రావడం, దానిలోంచి ఎవరో బయటికి దూకటం, వీళ్ళిదరినీ పట్టుకొని గబుక్కున జీపునెక్కించి తీసుకెళ్ళడం జరిగిపోయింది!

వీళ్లని ఎత్తుకెళ్ళిన జీపు వేగంగా పోయి, ఊరి చివరన ఉన్న పాడుబడ్డ బంగళా ముందు నిలబడింది. వస్తాదుల్లాంటి మనుషులు కొందరు అందులోంచి దిగారు. వీళ్ళిద్దరినీ లోపలికి తీసుకెళ్ళి కట్టిపడేశారు.

కాసేపయ్యాక, భయంకరమైన ముఖంతో ఉన్న వాడొకడు అక్కడికి వచ్చి చూశాడు వీళ్లిద్దరినీ. "సరేలెండి, ఏమీ పర్వాలేదు. ఎలుకలే. ఓసారి ఆ బాంబు పేలాక, ఈ రెండు ఎలుకల్నీ చంపేసి, చెరువులో పడెయ్యండి సరిపోతుంది" అని చెప్పి వాడు అక్కడినుండి వెళ్ళిపోయాడు.

అక్కడున్న రౌడీలు మారుతిని, అనిల్ ని బాగా కొట్టారు. వాళ్ళు కొట్టిన దెబ్బలకు అనిల్ ఐతే నిజంగా స్పృహ తప్పి పడిపోయాడు. మారుతి మాత్రం స్పృహ తప్పినట్లు నటిస్తూ పడిపోయాడు.

పిల్లలిద్దరూ పడిపోయారని అనుకున్న రౌడీలు వాళ్ల ప్రక్కనే కూర్చొని, సారాయి త్రాగటం మొదలు పెట్టారు. సారాయి ప్రభావంతో వాళ్లంతా ఒక్కరొక్కరుగా మత్తులోకి జారుకున్నారు.

అదంతా గమనించిన మారుతి "ముందు అక్కడినుండి బయటపడేదెలా..?" అనుకున్నాడు. పండ్లు కోసుకుని తినడానికి ఎప్పుడూ తన వెంట తెచ్చుకునే కత్తి ఉందో లేదో చూసుకున్నాడు. ఎంతయినా అల్లరివాడు కదా! సమయానికి అది జేబులోనే ఉంది. మెల్లగా తన నోటితోనే దాన్ని తీసి, ముందు చేతి కట్లు; ఆ తర్వాత నడుముకు-కాళ్ళకు కట్టిన కట్లను విడిపించుకున్నాడు. చప్పుడు చెయ్యకుండా అక్కడి నుండి పోలీసు స్టేషను వైపుకు పరుగు తీశాడు.

ఆ రోజున ఊరంతా ఒకటే జనాలు. రోడ్లన్నీ చాలా రద్దీగా ఉన్నాయి. మారుతి అట్లానే అందరినీ తప్పించుకుంటూ పరుగుపెట్టి, పోలీసు స్టేషను చేరుకున్నాడు. సంగతంతా పోలీసులకు గబగబా చెప్పేశాడు.

మారుతి మాటలు విన్న పోలీసులంతా వెంటనే అప్రమత్తమయ్యారు. పై అధికారులందరికీ విషయం ఫోన్ల ద్వారా చెప్పేశారు. కొందరు మారుతిని వెంటపెట్టుకుని బాంబు ఉన్న ప్రదేశానికి వెళ్ళారు. మరి కొందరు అనిల్ ని కట్టిపడేసిన భవనం దగ్గరకు చేరున్నారు.

ఒకవైపున వీళ్ళు బాంబును నిర్వీర్యం చేశారు; మరొకవైపున వాళ్ళు అనిల్‌ని కాపాడి ఆసుపత్రికి తీసుకెళ్ళారు. రౌడీలను అందరినీ అరెస్టుచేసి స్టేషనుకు తీసుకెళ్ళారు.

కాసేపటికి జిల్లా పోలీసు ఉన్నతాధి-కారులందరూ చేరుకున్నారు అక్కడికి. వచ్చీ రాగానే వాళ్లంతా మారుతిని, అనిల్‌ని చూస్తూ "వీళ్ళేనా, మన ముఖ్యమంత్రిగారిని కాపాడింది!?" అని అడిగారు ప్రశంసాపూర్వకంగా.

అప్పటికి అర్థమయ్యింది మారుతి, అనిల్ లకు- తెలీకుండానే తాము చేసిన గొప్ప పని ఏంటో! ముఖ్యమంత్రి గారిని లక్ష్యంగా చేసుకొని ఎవరో పెట్టిన బాంబుని తాము చూశామన్న మాట! ఆ సంగతిని పోలీసులకు తెలియపరచి, ఆ బాంబుని నిర్వీర్యం చేయించామన్న మాట! తాము లేకపోతే ముఖ్యమంత్రిగారికే కాక, ఇంకా అనేకమంది ప్రాణాలకు హాని కలిగేది!

అధికారులంతా మిత్రులిద్దరినీ చాలా ప్రశంసించారు. వాళ్ళిద్దరి వివరాలనూ అడిగి తెలుసుకున్నారు. ఇద్దరినీ జీపులో ఎక్కించుకుని, వాళ్ల ఇళ్ళ దగ్గర వదిలి రమ్మని ఒక పోలీసుని పంపారు.

కొన్ని రోజుల తర్వాత "సాహసబాలల అవార్డుకు మారుతి, అనిల్‌లను ఎంపిక చేసినట్లు" ఉత్తరం వచ్చింది. క్రొత్త సంవత్సరం జనవరి

26 వతేదీన రాష్ట్రపతి చేతుల మీదుగా వాళ్ళిద్దరికీ సాహసబాలల పురస్కారం అందించారు. అల్లరి మూకలు పెట్టిన బాంబును నిర్వీర్యం చేయించి అనేక మందిప్రాణాలను కాపాడినందుకుగాను వాళ్లను దేశమంతా గౌరవించింది.

అయితే, అప్పటినుండి మిత్రులిద్దరిలోనూ చాలా మార్పు వచ్చేసింది. ఇప్పుడు ఇద్దరూ బుద్ధిగా చదువుకుంటున్నారు!

అల్లరి పనులు చేయటం పూర్తిగా మానేశారు. బాధ్యత తెలిసి వచ్చింది. ఊరికే అనుకున్నంత మాత్రాన పోలీసులు కాలేరు కదా, ముందు బాగా చదవాలి మరి!

చిలిపి ప్రశ్న

**గొప్ప తల!**

ప్రశ్న: ఏ ఆటగాడు అందరికన్నా పెద్ద హెల్మెట్ ధరిస్తాడు?

జవాబు: పెద్ద తల ఉన్నవాడు!

**ఆపండి!**

ప్రశ్న: బస్ స్టాప్ కన్నా ముందే బస్సును ఆపాలంటే ఏం చేయాలి?

జవాబు: బ్రేక్ వేయాలి!

**అయ్యో, దేవుడా!**

ప్రశ్న: టన్ను బంగారం బరువు ఎక్కువా, టన్ను దూది బరువు ఎక్కువా?

జవాబు: రెండూ సమానమే!

**శాస్త్రీయం!**

ప్రశ్న: పంచదార ఎందుకు తియ్యగా ఉంటుంది?

జవాబు: నాలుకకు తీపి రుచి తెలుస్తుంది కాబట్టి!



# ఇంద్ర ధనస్సు

*'ప్రతి రంగుకూ దానిదైన ప్రత్యేకత ఉంది' అంటూ రాశారు ఝాన్సీ రాణి గారు.. చూడండి.*

*రచన: శ్రీమతి కె.ఝాన్సీ రాణి, హైదరాబాదు*

ఆరోజు రంగులన్నీ సమావేశమయ్యాయి. సభ చాలా అందంగా, ఆహ్లాదంగా శోభాయమానంగా వుంది. చిన్న చిన్న సింహాసనాలమీద తమ రంగు రాళ్ళు జిగేలు మనే కిరీటాలతో ఠీవిగా ఆసీనులయ్యాయి రంగుల మహారాణులు. ఆరోజు సభలో ముఖ్యమైన చర్చనీయాంశం- ఏ రంగు గొప్పది అని- ముందుగా పచ్చరంగు లేచినుంచుంది.

"అన్ని రంగులలోకి నేనే గొప్పదాన్ని, ఆకులు, చెట్లు, పైర్లు, పొలాలు అన్నీ పచ్చగానే ఉంటాయి. ప్రాణులన్నిటికీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నేనే ఆహారం, ఆధారం. నేను లేనిదే జీవకోటి మనుగడ కష్టం. అంతేగాక నారంగు కారణంగానే వృక్షాలు ఆహారాన్ని తయారుచేసుకుంటాయి. ఉదాహరణకి కోనసీమ ప్రాంతానికి వెళ్తే ఆ పైర్ల అందానికి ఏదీ సాటి రాదని మీకే తెలుస్తుంది. కాబట్టి నేనే గొప్పదాన్ని" అంది ఆకు పచ్చరంగు.

వెంటనే నీలం రంగు లేచి మాట్లాడసాగింది.

"ఆకు పచ్చరంగు వృక్షాలకే పరిమితం, కానీ ప్రపంచంలో ఎక్కువ భాగమైన నీటి రంగు నీలమే. అనంతమైన ఆకాశం నీలి రంగులోనే ఉందని ఎరుగరా? వృక్షాలు జీవి మనుగడకు ఆధారమే, కాదనను-కానీ ఆ చెట్లు బ్రతకాలన్నా అవసరమైన నీటి రంగు నీలం. కాబట్టి నేనే గొప్పదాన్ని" అని ముగించింది నీలం.



తర్వాత కాషాయ వర్ణం లేచి నిల్చున్నది:

"నేను మీ అందరిలా ఎక్కువ స్థలాన్ని ఆక్రమించక పోయినా, నా రంగు చాలా ముఖ్యం. క్యారట్, నారింజ, బొప్పాయి, మామిడి అన్నీ నా రంగులోనే ఉన్నాయి. నా రంగు బలానికి సంకేతం. రోజంతా ఏ రంగులో ఉన్నా, ఉదయించే సూర్యుడు, అస్తమించే సూర్యుడు నా రంగే. ఆ దృశ్యాలను చూసేవారెవరైనా ఇంక దేనినైనా చూసేందుకు ఇష్టపడతారా? పడరు. కాబట్టి నేనే గొప్ప" అన్నది కాషాయ రంగు.

తన కిరీటాన్ని సవరించుకుంటూ పసుపు రంగు నిలబడ్డది. నేను ప్రపంచానికి ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని, ఉద్వేగాన్ని తెస్తాను. సూర్యుడు పసుపు, చంద్రుడు పసుపు, నక్షత్రాలు పసుపు. సూర్యకాంతి పుష్పాన్ని చూడండి. ప్రపంచం అంతా మీతో కలిసి నవ్వుతున్నట్లు ఉండదూ? అందరికంటే నేనే గొప్ప" అన్నది పసుపు రంగు.

"నేను రక్తానికి గుర్తు. మనిషి శరీరంలో ఎరుపు రంగులేని నాడు మనిషే లేడు. విప్లవానికి గుర్తు ఎరుపు- అవసరం వచ్చినప్పుడు పోరాడి కావల్సింది సాధించటానికి అవసరమైన ఆ పటిమ రంగు ఎరుపు. అందుకని నేనే గొప్ప" అంది ఎరుపు రంగు.

"రాజసం ఒకలబోస్తూ నిలబడ్డది నీలి రంగు. నేను రాజసానికి రాచరికానికి గుర్తు. చక్రవర్తులు, రాజులు నన్ను తమ రంగన్నారు.

వాళ్ళకు లోబడి అందరూ నడిచేవారు. నేను అందరిలోకీ గొప్ప రంగును" అన్నది నీలి రంగు.



అంతలో ఊదారంగు నెమ్మదిగా నిలబడ్డది. "నేను ప్రశాంతతకు, నిశ్చలతకు చిహ్నాన్ని. రోజంతా ఎలా ఉన్నా, రాత్రి నిశ్శబ్దంగా, ప్రశాంతంగా నిద్రించనిదే మనిషి జీవితం సాగదు. అందుకని నేనే గొప్ప" అన్నది ఊదారంగు.

ఇంతలో హోరుమని వర్షం ప్రారంభమైంది. అన్ని రంగులూ భయంతో వణికిపోతూ దగ్గరికి జరిగాయి. మెరుపు మెరిసింది. ఉరుముకుంటూ వర్షం రంగులతో అన్నది-

"రంగుల్లారా! మీలో మీరు 'నేను గొప్ప' అంటే 'నేను గొప్ప' అని కొట్టుకోవటం మంచిది కాదు. ప్రకృతి ప్రపంచంలో ఒక్కో రంగుకు ఒక్కో ప్రత్యేకతనిచ్చింది. దేనికదే గొప్ప. అందుకని మీరంతా చేతులు కలపండి. శిరసు వంచండి. ఆ ప్రకృతికి నమస్కరించండి" అన్నది.

రంగులన్నీ సిగ్గుపడ్డాయి. అన్నీ చేతులు కలిపాయి. ఆకాశంలోకెగసి, ప్రకృతికి నమస్కరిస్తూ శిరసు వంచాయి. వానాకాలంలో మనకు కనిపించే ఇంద్రధనస్సు అదే!

**పొడుపులు!**

1. చేతికి దొరకనిది ముక్కుకు దొరుకుతుంది?
2. నేలపై పడేస్తారు కానీ లేపలేరు?
3. చలివేయక పోయినా ఒంటిమీద బట్టలు కప్పుకునే జంతువు?
4. కాళ్ళులేవు, కదలలేదు కానీ ఏ ఊరైనా వెళుతుంది?

జవాబులు మరి ఎక్కడున్నాయో... వెతకండి!

# సద్గుణం-దుర్గుణం

"మనలోని చెడుకు కారణాలు రెండు: ఒకటి, మనలో ఆత్మస్థైర్యం తగ్గటం, రెండు-మనకు కష్టపడే తత్వం లేకపోవటం.." అని చెబుతున్న ఈ కథ అర్థమయ్యిందో లేదో చెప్పండి...
రచన: డా.సిరి, మిర్యాలగూడ, నల్గొండ

పూర్వం ఆరావళి పర్వత ప్రాంతంలో సౌశీల్యుడనే గురువుగారు ఒకరుండేవారు. భార్య, కుమారులతో కలిసి ఒక గురుకులాన్ని నడిపేవారు ఆయన. ఆయన మేధా సంపత్తి, పాండిత్యం నిరుపమానం. అన్నింటినీ మించి-విద్యార్థులకు ఆయన విద్య నేర్పించే తీరు చాలా ప్రత్యేకంగా ఉండేది. అనేక దేశాల రాజులు తమ కుమారులని విద్యాభ్యాసం కోసం ఆయన గురుకులానికి పంపేవాళ్ళు. సౌశీల్యుడు ఎంతో ప్రేమగా వారికి విద్యలన్నీ నేర్పించేవాడు. వారికి ఆయన నేర్పే విద్యల్లో మొదటిది, సహనాన్ని- మంచితనాన్ని

అలవర్చుకోవటం. 'ఎన్ని గొప్పవిద్యలు నేర్చినా; వాటిలో ఎంతగా రాణించినా; మంచి బుద్ధి, మంచి నడవడిక లేకపోతే అవన్నీ వ్యర్థం' అని ఎప్పుడూ శిష్యులకు చెప్పేవాడాయన.

ఈ మధ్యనే భార్గవుడనే రాకుమారుడు విద్యనభ్యసించడానికి సౌశీల్యునివద్దకొచ్చాడు. భార్గవుడు తెలివైనవాడే కాని , మిగతా వారితో పోలిస్తే అతనికి విషయ గ్రహణ శక్తి తక్కువ. అది గ్రహించిన సౌశీల్యుడు భార్గవుడికి అర్థమయ్యేలా నెమ్మదిగా చెప్పటం మొదలు పెట్టాడు.

అంతలోనే సౌశీల్యుడికి పొరుగు రాజ్యానికి వెళ్ళాల్సిన పని పడింది. తాను తిరిగిరావడానికి పక్షం రోజులైనా పడుతుందని, అందాకా శిష్యులను, గురుకులాన్ని జాగ్రత్తగా చూసుకోమని భార్య దేవకికి చెప్పి, పొరుగు రాజ్యానికి పయనమయ్యాడు సౌశీల్యుడు.

పక్షం రోజుల తరువాత ఆశ్రమానికి తిరిగివచ్చిన సౌశీల్యునికి ఆశ్రమ వాతావరణంలోను, తన శిష్యుల నడవడికలోను మార్పు కానవచ్చింది. ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ, హుషారుగా-ఆనందంగా- సంతోషంతో వెలిగిపోయే శిష్యుల ముఖాలలో ఇప్పుడు విచారపు ఛాయలు కనబడటం ఆయన్ని ఆశ్చర్యపరచింది. అంతేకాక, ఎప్పుడూ కలిసి మెలిసి ఉంటూ 'కల్మషం'అనే పదాన్ని కూడా తమ మధ్యకు రానివ్వని రాకుమారుల మధ్య మునుపటి మైత్రీ బంధం కనబడకపోవడం ఆయన్ని కలవరపరచింది. అసలేం జరిగిందో తెలుసుకుందామని దేవకి దగ్గరకు వెళ్ళిన సౌశీల్యుడు దిగాలుగా కూర్చున్న దేవకిని

చూసి మరింత ఆందోళన పడ్డాడు- "దేవకీ! అసలేం జరిగింది? నీ ముఖంలో అంత ఉదాసీనతకు కారణం ఏమిటి? మన శిష్యుల ప్రవర్తనలో మార్పు రావడానికి కారణమేమిటి? వివరంగా చెప్పు!" అన్నాడు.

అప్పటివరకూ సౌశీల్యుడు రావటాన్నే గమనించలేదు దేవకి. ఆయన మాటలకు ఒక్కసారి ఉలిక్కి పడి- "స్వామీ! మీ రాకకోసమే ఎదురుచూస్తున్నాను. అసలు ఈ మార్పుకంతటికీ కారణం భార్గవుడే అనిపిస్తున్నది. 'ఎప్పుడూ మంచి బుద్ధితో, మంచి నడవడికతో బ్రతకాలి' అని మీరు చెబుతుంటారు కదా; మీ శిష్యులు చాలామంది ఆ బాటలోనే నడుస్తున్నారు. కానీ భార్గవుడిలో సద్గుణాలు లేవు; సరికదా అతడిలో అన్నీ దుర్గుణాలే, అన్నీ చెడ్డ ఆలోచనలే! తనకంటే బాగా చదివేవారిపట్ల ఈర్ష్య, అసూయ; తనకన్నా ముందున్న వారిపట్ల కోపం; తనకి మంచి చెప్పే వారిపట్ల శత్రుత్వం- కనబరుస్తూ అందరినీ బాధ పెడుతున్నాడు. తోటి వారెవరైనా 'ఇది తప్పు' అని చెబితే వారి మీద దాడికి దిగుతున్నాడు. అయినా నాకు భార్గవుడంటే కోపం ఏమీ లేదు. వాడు నా కుమారుడిలాంటి వాడు. ఎంతో మంచి భవిష్యత్తు ఉన్న పిల్లవాడు, ఇలా పెడదోవన పయనించకుండా అతనిలో మార్పు తీసుకురావల్సిన బాధ్యత మనదే కదా!" అన్నది దేవకి.

"బాధపడనక్కరలేదు, దేవకీ! భార్గవుడు మన వద్దకు వచ్చింది ఈ మధ్యనేగా? కొన్నాళ్ళపాటు అతనిలో పాత సంస్కారాలు బలంగా ఉంటాయి. క్రమంగా అతనూ మిగిలిన వారి మాదిరి సద్గుణ సంపన్నుడవుతాడు. ఇక అతన్ని గూర్చిన

దిగులు వదిలేయి!" అన్నాడు సౌశీల్యుడు చిరునవ్వుతో.

భార్యకు మాట అయితే ఇచ్చాడు గానీ, ఆయన భార్గవుడిని ఏమీ అనలేదు. మునుపటి లాగే అతనికి విద్యను బోధించ సాగాడు. పైపెచ్చు, మిగతా విద్యార్థులందరికంటే భార్గవుడితోటే ఎక్కువ సమయం గడపటం మొదలు పెట్టాడు. అతనికి ఒక్కడికే ప్రత్యేకంగా రకరకాల కథలు చెప్పేవాడు. ఆ కథల్లోని నీతిని కనుక్కొనమనేవాడు.

కొన్నాళ్ళలోనే ఆ అద్భుతం జరిగింది: భార్గవుడు నిజంగానే మారిపోయాడు! తన మంచి గుణాలతోటీ, మంచి నడవడికతోటీ తోటివారి ప్రేమను సంపాదించుకున్నాడు. మొదట్లో అందరితోటీ శత్రుత్వం మూటగట్టుకున్న భార్గవుడు ఇప్పుడు దేవకి ఆశించినట్లుగానే, అందరితోటీ ప్రేమగా మెలగసాగాడు! భార్గవుడిలో వచ్చిన ఈ మార్పుకు ఎంతగానో సంతోషించిన దేవకి అదెలా సాధ్యమైందని అడిగింది సౌశీల్యుడిని-

"దేవకీ! స్వతహాగా మనుషులందరూ మంచివాళ్ళే. సందేహంలేదు. సాధారణంగా ఎవరిలోనైనా దుర్గుణాలు కలగడానికి ఒక కారణం వారిలో ఆత్మస్థైర్యం లోపించడం: తనమీద, తన శక్తి మీద తనకే నమ్మకం లేకపోవడం; మరొక కారణం కష్టపడేతత్వం లేకపోవడం-"

"భార్గవుడూ అంతే. అతనూ స్వతహాగా మంచివాడే; కానీ, అతనిలో విషయగ్రహణ శక్తి తక్కువ. అందువల్ల మిగతావారిలా తొందరగా విషయాన్ని గ్రహించలేడు. అతను అందరికన్నా వెనకబడటానికి కారణమూ అదే.

ఎంత ప్రయత్నించినా అతను అందరితోటీ సమానంగా ఉండలేకపోయేవాడు.

అట్లా 'ఇతరుల స్థాయిని తను అందుకోలేడు' అన్న ఆలోచన వల్ల తన మీద తనకే నమ్మకం తగ్గింది అతనికి. తనకు లేనిది ఇతరులకు ఉందన్న బాధకన్నా, ఇతరులలా తాను లేడన్న బాధతోనే అతని మనసు క్షోభ పడింది. అతనిలోని అసూయకు, ఈర్ష్యకు కారణమైంది అదే. తనలోని లోపమేమిటో తెలియజెప్పకుండా అందరూ గుడ్డిగా అతడిని మారమని చెప్పారు; దాంతో అతను మరింత అయోమయానికి గురయ్యాడు. అందరినీ శత్రువుల్లా చూడటం మొదలు పెట్టాడు-"

"నేను చేసిందల్లా అతనిలో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు ప్రయత్నించటం. భార్గవుడిలో కష్టపడే తత్వం ఉంది. ఒకసారి నా ప్రయత్నంలోని నిజాయితీ అతనికి అర్థం అవ్వగానే, అతడు రేయింబవళ్ళూ కష్టపడ్డాడు; శ్రద్ధతో, పట్టుదలతో నేను నేర్పిన విద్యలన్నీ చక చకా నేర్చుకున్నాడు. దాంతో తోటి విద్యార్థులకన్నా తనేమీ తక్కువకాదని నమ్మకం కలిగింది అతనికి- అతని ఆత్మస్థైర్యం మరింత వృద్ధినొందింది. అందరిలాగే తానూ ఏదో ఒక పనిని విజయవంతంగా చేయగలుగుతానని నమ్మినప్పుడు, ఇంక ఇతరులపై ఈర్ష్యకు, అసూయకు చోటేది? అందరికన్నా తాను ఏ విధంగానూ భిన్నంగా లేనప్పుడు, ఇక వేరేవారితో గొడవకు తావేది?" అన్నాడు సౌశీల్యుడు, జరిగినది వివరిస్తూ.

# పదాల్ని వెతికి పట్టుకోండి!

*ఈ పట్టికలోని అక్షరాల్లో క్రింది పదాలు దాక్కొని ఉన్నాయి! నిలువుగా, అడ్డంగా, మూలగా, క్రిందినుండి పైకి, కుడినుండి ఎడమకు- ఎలా పడితే అలా! వాటిని వెతికి పట్టుకోండి! వాటి చుట్టూ చుట్టండి!*

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| గా | ల | కి | సం | గా | మి | ఆ | ద | రో | డ | మ | ఆ |
| గ్య | అ: | క | ద | క | మ | లి | క | ము | మి | మొ | డ |
| ర | క | వం | డి | ల | న | డ | క | గ్య | స | వం | యు |
| మ | డ | ఆ | భో | క | వా | యూ | సం | లి | డి | మి | మా |
| యూ | ము | స | లి | మొ | లి | యా | గ | తా | డ | వ | క |
| వం | ల | ఆ | క | ద | గా | నా | సం | లి | క | ఆ | గ |
| ము | సం | డి | రో | క | ఊ | మ | డ | క | గో | ల | క |
| ద | బ | లి | భా | గ్య | ము | ద | డు | చా | మ | ము | ష్ట |
| ప | ర | ఉ | వ | వం | ము | డ | త | ల | కా | యు | వం |
| మ | న | డు | ము | గా | క | మి | లి | యు | వం | గ్య | కీ |
| ర | వ | త | మొ | ల | ఆ | ష్ట | ఈ | కం | ల | టి | క్ |
| ప | భా | గ్య | ప | త | గ | మీ | ము | భా | కి | గీ | పం |

మొసలి, ముసలి, ఆకలి, రోకలి, ఉడుత, తలకాయు, వంకర, గాలివాన, నడుము, నడక, కిటికీ, సందడి, నాగలి, పలక, మామిడి, చాకలి, కలిమి,ఆరోగ్యము, భాగ్యము, భావము, కష్టము, ఆమడ, మడక, పరమపదము, యూగ

# నక్క నేర్చిన పాఠం

రూమీ చెప్పిన కథలు

*మూలం: ద లెజండ్ ఆఫ్ రూమీ*

*స్వేచ్ఛానుసరణ: నారాయణ, కొత్తపల్లి బృందం*

అనగనగా ఒక అడవిలో జిత్తులమారి నక్క ఒకటి ఉండేది. దానికి స్వయంగా వేటాడటం రాదు; అడవిలో ఏదో కారణంచేత చచ్చి పడివున్న జంతువులను తిని బ్రతుకుతుండేది అది.

ఒకసారి దానికి అడవిలో ఏ జంతువూ దొరకలేదు. ఆకలితో నాలుగు రోజులు అలమటించాక, దానికి ఒక ఉపాయం తోచింది. "మృగరాజైన సింహంతో జతకడితే...!?" అనుకున్నది.

అది వెళ్ళేసరికి సింహం ముందు ఒక తోడేలు నిలబడి ఉంది. అది సింహానికి వేటలో మెళకువలు నేర్పుతున్నది. సింహం శ్రద్ధగా వినటం చూసి నక్కకు ముచ్చట వేసింది. అది

సింహంతో "ప్రభూ, తమరు వేటాడగా చూడాలని నాకు మహా కోరికగా ఉన్నది. తమరి అనుచరులుగా నేను, ఈ తోడేలూ తమరి వెంట వేటకు రాకోరుతున్నాము. తమరు అంగీకరిస్తే ధన్యులమౌతాము" అన్నది.

తక్కువ జాతివైన నక్కలతో, తోడేళ్ళతో కలిసి వేటకు పోవటం సింహానికి నామోషీ అనిపించింది. కానీ నక్క అడిగిన తీరువల్ల, కాదనేందుకు దానికి వీలవ్వలేదు. ఆ విధంగా ఆ మూడూ కలిసి అడవిలోకి పోయినై; ఒక అడవి దున్నను, ఒక అడవి గొర్రెను, ఒక కుందేలును చంపాయి.

నక్కకు, తోడేలుకు ఆ మాంసాన్ని చూసేసరికి నోట్లో నీళ్ళు ఊరాయి. "ఈ వేటలో మా భాగం ఎంత ఉంటుందో.." అని ఆలోచించటం మొదలుపెట్టాయవి.

అవి అట్లా చొంగలార్చుకుంటూ నిలబడటం చూసిన సింహానికి చాలా చికాకు వేసింది. "దొంగ వెధవల్లారా! ఆగండి! ఏమౌతుందో చూడండి! మీ దురాశకు తగిన గుణపాఠం చెప్పకపోతే నేను మృగరాజునేకాదు. జన్మలో మరిచిపోలేని పాఠం చెప్తాను ఆగండి!" అనుకున్నది అది.

పైకి మాత్రం రాజసంగా ముఖం పెట్టి, అది తోడేలుతో అన్నది "చూశావుగా?! మన ముందు చాలా మాంసం పడిఉన్నది. దీన్ని అంతటినీ మన తాహతుకు తగినట్లుగా పంచు" అని.

తెలివి తక్కువ తోడేలు వెంటనే నోరు జారింది- "మహాప్రభూ! మూడు జంతువులలోకీ పెద్దదైన అడవిదున్న మహాప్రభువులు, ఉత్తమజీవులు అయిన తమరికి చెందుతుంది.

మధ్యరకం ప్రాణి కనుక, ఈ అడవిగొర్రె నాకు చెందాలి. అల్ప జీవి అయిన నక్కకు ఈ చిట్టి కుందేలు సరిపోతుంది!" అన్నది.

ఇది వినగానే సింహం కళ్ళు కోపంతో ఎర్ర-బడ్డాయి. దాని వెంట్రుకలు నిటారుగా నిలబడ్డాయి. ఉరుములు ఉరిమినట్లు అరిచింది అది: "నీచపు కుక్కా! మా స్థాయి ఎక్కడ, నీ స్థాయి ఎక్కడ!? మాతోపాటు వేటను పంచుకునేందుకు, వాటా అడిగేందుకు నీకెన్ని గుండెలు?! ఎంత ధైర్యం నీకసలు..?!" అని. అట్లా అరుస్తూ ముందుకు దూకి అది తోడేలును ఒక్క చరుపు చరిచింది. ఆ దెబ్బకు తోడేలు అక్కడికక్కడ తలపగిలి చచ్చింది!

తరువాత సింహం నక్కవైపుకు తిరిగి, వేటను పంచమన్నది.

తోడేలు గతిని చూసిన జిత్తులమారి నక్కకు ఆ సరికే సగం ప్రాణాలు పోయినై. 'బలవంతులతో చెలిమి తన వంటి బక్క ప్రాణులకు తగదు' అని అది ఆ సరికే గ్రహించింది. అయినా ఇప్పటికి చేయగలిగింది లేదు. ఏదో ఒక విధంగా తప్పించుకోవాలి...

అందుకని అది సింహంతో- "మహారాజా, ఇందులో ఆలోచించాల్సింది ఏమీ లేదు. బలిసిన ఈ దున్న ఈ ఉదయాన తమరికి అల్పాహారం అవుతుంది. బలిసిన ఈ అడవి గొర్రె తమరి మధ్యాహ్న భోజనానికి అనువుగా ఉంటుంది. ఇక ఈ కుందేలు ఉన్నది చూశారా, అది ఈ రాత్రికి తమకు రుచికరమైన భోజనం కాగలదు!" అన్నది.

జిత్తులమారి నక్క తెలివిగా చేసిన ఈ

పంపకానికి సింహం చాలా సంతోషపడింది. మనసులోనే ఉబ్బిపోతూ అది "ఓ ప్రియమైన నక్కా, అందరికీ అనుకరణీయమైన, అతి అద్భుతమైన ఇంత చక్కని పంపకపు విధానాన్ని నువ్వు ఎక్కడ నేర్చుకున్నావు?" అని అడిగింది.

నక్క అణకువగా తల వంచుతూ, "మహా ప్రభూ, తన తెలివిమాలిన మూర్ఖపు ప్రవర్తన కారణంగా కొద్ది సేపటి క్రితమే తమ చేత యమపురికి పంపబడిన వెర్రి తోడేలు ఉదాహరణ నుండి నేను ఈ కళను నేర్చుకున్నాను. నావంటి అల్పుడికి ఇంత గొప్ప పాఠం నేర్పిన శ్రేయస్సు పూర్తిగా తమరిదే!" అన్నది.

ఈ జవాబుతో సింహం ఎంత సంతోషపడిందంటే అది నక్క భుజాన్ని తట్టుతూ "విస్వాసం గల ఓ నక్కా! నువ్వు నీ స్వంత అస్తిత్వాన్ని నాకోసం త్యాగం చేసిన తీరు అమోఘం. నేను నిన్ను మెచ్చాను. ఈ జంతువులన్నింటినీ నీకే బహుమానంగా ఇవ్వాలని నిశ్చయించాను. పండగ చేసుకో, ఇక సంతోషంగా ఉండు!" అని వెళ్ళిపోయింది.

"చస్తూ చస్తూ బ్రతికిపోయాను. చావుకు అంత దగ్గరగా వెళ్ళికూడా, కేవలం నా అదృష్టంకొద్దీ బతికాను. ఇక ఎప్పుడూ అహంకారులతో పొత్తు పెట్టుకోను" అని ఒట్టు పెట్టుకున్నది నక్క, నిండుగా ఊపిరి పీల్చుకుంటూ.



# ఆనెస్టీ స్టాల్

*బడిలో పిల్లలకు అవసరమయ్యే వస్తువుల్ని ఈ కథలోలాగా పెట్టగలిగితే నిజంగా బావుంటుందేమోనేం...?*

*రచన: శ్రీమతి ఆదూరి హైమవతి, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని, బెంగళూరు.*

కొత్తపల్లి పాఠశాలకు హెడ్మాస్టర్‌గా బదిలీమీద వచ్చి చేరారు కామేశం గారు. మొదటిరోజు అసెంబ్లీ అయిపోయేంతలోనే ఏడో తరగతి చదివే వాసు వచ్చి, "పంతులుగారూ! నా జామెట్రీ బాక్సు కనిపించట్లేదు. రాత్రే మా నాన్నగారు కొత్తది కొని తెచ్చారు. ఇప్పుడు అది పోయిందంటే నా వీపు బద్దలు చేస్తారండీ!" అని ఏడ్వసాగాడు. కామేశంగారు అందరినీ అసెంబ్లీలోనే నిలబెట్టి సంచులన్నీ వెతికించారు. జామెట్రీ బాక్సు మాత్రం దొరకలేదు.

తర్వాత రెండో రోజున ఆరో క్లాస్ చదివే ఆనంది "మాస్టారూ! నా కొత్త పెన్ అసెంబ్లీ నుండి

వచ్చేసరికి నా బ్యాగ్ లో లేదండీ! మా అమ్మ చంపేస్తుందండీ !" అని ఆయన ఆఫీస్ గదికి వచ్చి చెప్పి, ఎక్కిళ్ళు పెట్టి ఏడ్వసాగింది.

"పాపా! నువ్వెళ్ళి క్లాస్‌లో కూర్చో. నేను వచ్చి చూస్తాను " అని చెప్పి పంపారు కామేశంగారు. వెంటనే స్టాఫ్ మీటింగ్ ఏర్పాటు చేసి, ఉపాధ్యాయులందరితోటీ ఈ విషయం గురించి చర్చించారు.

"సార్ ! మన బళ్లో ఇలాంటి దొంగతనాలు రోజూ జరుగుతూనే ఉన్నాయండీ! ఎవరు చేస్తున్నారో తెల్సుకోలేక పోతున్నాం. ఎవర్నీ దండించలేక పోతున్నాం. ఎవరినైనా అనుమానించి అడిగితే వారి తల్లిదండ్రులు వచ్చి యాగీ చేస్తున్నారు. ఇదింతే మాస్టారూ! మనం ఏమీ చేయలేం. వదిలేయాల్సిందే!" అన్నారు ఉపాధ్యాయులు.

అందరి అభిప్రాయాలూ విన్నాక కామేశం గారు చెప్పారు: "చూడండి, ఇంతవరకూ జరిగినదాన్ని పక్కన పెట్టండి. ఇప్పుడు ఏం చేయాలో ఆలోచించండి! నాకు ఏం అనిపిస్తున్నదంటే, వారం రోజుల్లో మనం మన పాఠశాలలో ఒక 'ఆనెస్టీ స్టాల్ 'ని ప్రారంభిద్దాం . దాని నిర్వహణ బాధ్యత ప్రధానంగా నాదే. అయితే మీలో ఎవరికి ఎప్పుడు ఖాళీ సమయం ఉంటే అప్పుడు వాళ్ళు దీన్ని దగ్గర ఉండి నడపండి!" అని చెప్పారు.

ఉపాధ్యాయులందరికీ అనుమానమే- అలవాటై మొద్దుబారిపోయిన దొంగలు ఆ స్టాల్‌లోని సరంజామానంతా ఒక్క రోజులో దోచేస్తారని. కానీ ప్రధానోపాధ్యాయునికి ఎదురు చెప్పలేక, అందరూ మౌనం వహించారు.

ఒక వారం రోజుల్లో కామేశంగారు 'ఆనెస్టీ

స్టాల్'ను ఆవిష్కరింప జేశారు. తన వరండాలో కిటికీలోంచి తాను కనిపించేలా ఒక టేబుల్, దానిమీద అలమారలా వున్న ఒక చెక్క సాధనాన్ని చేయించారు. దానిలో వరుసగా పేజీల వారీగా నోటు పుస్తకాలున్నై. ఆ నోటు పుస్తకాలలో ప్రతిదీ ప్రత్యేకమైన పేజీనే- ప్రతి పేజీమీద 'ఆనెస్టీస్టాల్' అని ముద్ర వేసి ఉంది. పెన్సిళ్లు, పెన్నులు, ఎరేజర్లు, జామెట్రీ బాక్సులు , పలకలు, బలపాలు- ఇలా బడి పిల్లలకు అవసరమైన సామగ్రి అంతా ఏర్పరచారు . ప్రతి వస్తువు మీదా 'ఆనెస్టీ స్టాల్' అని ముద్రవేసి, ఆ ప్రక్కగా వస్తువు వెల ముద్రించి ఉంది. ఆ టేబుల్ మీదే ఒక ప్రక్కగా డబ్బుల పెట్టె ఉంచారు.

ఆ రోజున అసెంబ్లీలో కామేశంగారు వివరించారు: "పిల్లలూ! 'ఆనెస్టీ'- అంటే ఏంటో తెలుసుగా, 'నిజాయితీ'- మనందరికీ నిజాయితీ చాలా ముఖ్యం. ఆ నిజాయితీని ఎప్పటికప్పుడు గుర్తు చేసేందుకు గాను ఈరోజు నుండి మన బళ్ళో 'ఆనెస్టీ స్టాల్ 'ని ప్రారంభిస్తున్నాం. ఈ స్టాల్‌లో మీకు కావలసిన చాలా వస్తువులు లభిస్తాయి. ప్రతిదీ బయట దుకాణాలలోకంటే తక్కువ ధరకు లభించేలా చర్యలు తీసుకున్నాం. అయితే ఈ స్టాల్ లో 'అమ్మేవాళ్ళు' అంటూ ఎవరూఉండరు. వస్తువును తీసుకున్న విద్యార్థే, తప్పనిసరిగా ఆ వస్తువు పేరిట బిల్లు రాసుకోవాలి; తనంతట తానుగా ఆ మొత్తాన్ని పెట్టెలో వేసి వెళ్ళాలి.

దూరంగా కూర్చొని ఉన్న ఇంచార్జ్ ఉపాధ్యాయుడు , కేవలం చూపరిగా చూస్తూ ఉంటాడు; చిల్లర అవసరమైన వారికి చిల్లర అందిస్తుంటాడు-అంతే. ఆఫీస్ గదిలోంచి నేను కూడా ఒక కన్ను వేసి ఉంచుతాను.

ఏ రోజుకారోజు వస్తువుల లెక్క , సొమ్ములెక్క

ఇద్దరు ముగ్గురు ఉపాధ్యాయులు కలిసి చూస్తుంటారు. లెక్క సరిపోతుంటే మంచిదే- లేక పోతే ఎక్కడో పొరబాటు జరుగుతున్నట్లు- అలాంటప్పుడు ఇదే మనందరి నిజాయితీకి పరీక్ష అవుతుంది. మరింత కట్టుదిట్టంగా స్టాల్‌ని నడపవలసి వస్తుంది. అలాంటి అవసరం అసలు తలెత్తదనే నానమ్మకం.. అర్థం అయ్యిందిగా?" అన్నారు.

పిల్లలంతా తలలూపారు.

కామేశంగారు ఇంకా చెప్పారు "మీలో ఎవరైనా మీకు అవసరమైన వస్తువులు కొనాలను- కున్నారు; కానీ డబ్బులు తెచ్చుకోడం మర్చిపోయారనుకోండి- అట్లాంటివాళ్లకు కూడా ఆనెస్టీస్టాల్ సాయం చేస్తుంది. స్కేళ్ళు, జ్యామెట్రీ బాక్సులవంటి కొన్ని వస్తువులను మన బడి పిల్లలు క్లాసుకు తీసుకెళ్ళి వాడుకోవచ్చు; ఆ తర్వాత వాటినే కొనుక్కోవాలంటే కొనుక్కోవచ్చు; లేకపోతే క్లాసు తర్వాత తెచ్చి వాపసు ఇవ్వవచ్చు" అని.

వింటున్న పిల్లల ముఖాలు వికసించాయి.

అటుపైన ఆనెస్టీ స్టాల్ ప్రారంభం అవ్వగానే పిల్లలంతా ఎగబడి వస్తువులను తీసుకున్నారు. అందరినీ వరుసగా ఒకరి తర్వాత ఒకరిని లోనికి పంపసాగాడు స్కూల్ లీడర్. ఉపాధ్యాయుల పని కేవలం చిల్లల అందించటమే.

ఆశ్చర్యం! ఆనెస్టీ స్టాలు లెక్క ఏనాడూ తప్పలేదు, స్టాలు వస్తువు ఏ ఒక్కటీ పోలేదు! అంతేకాదు, బడిలో దొంగతనాలు పూర్తిగా తగ్గిపోయాయి!

"కొంతమంది పిల్లలు తమకు బళ్ళోకావల్సిన వస్తువులు ఇంట్లోనే మర్చిపోయివస్తుంటారు. తీరా వచ్చాక, ఉపాధ్యాయులు కోప్పడతారు కదా, అని వేరేవాళ్ల సంచిలోంచి

తీసేసుకుంటుంటారు. అడిగితే అవి తమవే అనేస్తుంటారు. అయితే ఇప్పుడు వాళ్లకు ఆ అవసరమే లేదు- ఆనెస్టీ స్టాలులోంచి తెచ్చుకోవచ్చు; తిరిగి వాపసు ఇవ్వవచ్చు కూడాను- అందువల్ల వాళ్ళెవరూ తప్పుపని చేయట్లేదు" అని చెప్పారు కామేశంగారు, వారాంతపు ఉపాధ్యాయుల సమావేశంలో.

"అవునండీ! ఊరికే నోటితో -'ఇతరుల వస్తువులు దొంగతనం చేయడం నేరం - పరుల సొమ్ము పామువంటిది' అని నీతులు చెప్పేకంటే, నీతిని పాటించే విధానాన్ని నేర్పటం; అవసరానికి కావల్సిన వస్తువుల్ని అందుబాటులోకి తేవటం చేస్తే చాలు- ఎవ్వరికీ ఇక దొంగిలించే అవసరం ఉండదు. పిల్లలు తమ చిట్టి చిట్టి అవసరాలకు అమాయకంగా దొంగిలడం అలవాటుచేసుకుని, ఆ తర్వాత పెద్ద నేరాలు చేయకుండా, పసితనంలోనే చాకచక్యంగా ఆపేయడం కూడా ఉపాధ్యాయులుగా తమ బాధ్యత అని స్టాఫ్ అంతా తెల్సుకున్నారు. మొక్కగానే వంచాలి, మానైనాక వంగదుకదా!

ఇలా ఆనెస్టీ నేర్పడంతో పాటుగా, దొంగతనాలూ ఆగిపోడంతో ఉపాధ్యాయులంతా ఊపిరి పీల్చుకున్నారు.

పెద్దపంతులు కామేశం గారు కొత్తవిషయాన్ని తమతో చేయించి నిరూపించిన విధానానికి అంతా ఆయనకు ధన్యవాదాలు చెప్పారు.

పొడుపు!

5. ఒళ్ళంతా కన్నులు; పొట్ట నిండా గింజలు- ఏంటది?

6. అందమైన వెండి కంచం కొన్ని రోజులు కనిపిస్తుంది, కొన్నిరోజులు మాయమైపోతుంది...?

7. ఎంత దూరం నెట్టితే అంత దగ్గరౌతుంది- ఏంటది?

8. కారుగాని కారు పరుగులో జోరు?

9. మూట విప్పితే ముక్కు పట్టుకుంటుంది?

10. రెండు అంగుళాల గదిలో యాభై మంది దొంగలు ..?!

సమాధానాలు ఎక్కడున్నాయో... వెతకండి!

# జింక - పులి

మూలం: బౌద్ధకథలు అనుసరణ: నారాయణ

ప్రకృతి మనోహరంగా ఉంది. ఆకాశాన్నంటే పర్వతాలు పచ్చగా, బరువుగా ఉన్నాయి. దట్టమైన అడవిలో ఎండ పొడ కానని ప్రాంతాలు ఎన్నో. రంగురంగుల పూలు, సెలయేర్లు, పద్మాలతో నిండిన కొలనులు- వాతావరణం చాలా అందంగా ఉంది. కానీ వూ-చాంగ్ ప్రకృతి సౌందర్యాన్ని చూడటం లేదు. దాంతో అతనికి పనేలేదు. అతను, అతని కొడుకు ఈ కొండల్లో దొరికిన ప్రాణినల్లా వేటాడుతూ గడుపుతారు రోజంతా.

బాణాలు వేయటంలో వూ-చాంగ్‌ని మించినవారు లేరు. అతను ఏనాడూ గురి తప్పలేదు. బాణం వెయ్యాలంటే అసలు అతను గురి చూడవలసిన పనేలేదు. అతను లక్ష్యాన్ని చూసేవాడు; ధనస్సునుండి బాణం

వెలువడేది; లక్ష్యాన్ని తగిలేది. అతని శరాలనుండి తప్పించుకొనగలిగినంత చురుకుదనం గానీ, శక్తిగానీ ఏ జంతువుకీ లేదు.

అదుగో! అటుచూడు! చిట్టిజింకపిల్ల! ప్రకృతిలో ఏ ప్రాణీ దానంత ముద్దుగా, అందంగా, అమాయకంగా ఉండి ఉండదు. కానీ, వూ-చాంగ్ వచ్చింది ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించడానికి కాదు. అతని కంటికి జింక పిల్ల కనబడిందో లేదో, అతని అమ్ములపొది నుండి ఒక బాణం బయటికి వచ్చింది- జూ...మ్...! అంతే! చిట్టి జింక పిల్ల చచ్చి పడిపోయింది. అప్పుడు చూశాడు వూ- జింకపిల్లకు దగ్గర లోనే ఉంది తల్లి జింక- అది అక్కడే, గడ్డిలో ఉండింది అంతసేపూ. తను ఉన్నచోటు నుండి జింకకు సరైన కోణం కుదరలేదు, అందువల్ల వూ-చాంగ్ కొంచెంసేపు వేచి చూశాడు.

పిల్ల జింక క్రింద పడిపోగానే తల్లి జింక గబుక్కున లేచి దాని దగ్గరికి వచ్చింది. ఆత్రంగా దాని గాయాన్ని నాకుతూ, కళ్ళలోంచి నీళ్ళు కార్చింది. దాన్ని ఆ పనిలో నిండా మునగనిచ్చి, చకాలున ఒక బాణం వదిలాడు వూ-చాంగ్. దాంతో తల్లి జింక కూడా చచ్చి పడిపోయింది.

కానీ వూ-కి సంతృప్తి కలగలేదు. అక్కడికి దగ్గరిలోనే, గడ్డిలో మరికొంత కదలిక కనిపించింది అతనికి. ఆ ప్రాంతంలో ఇంకా కొన్ని జింకలు ఉండి ఉంటాయి.. కనీసం ఒకటయితే ఉన్నది... బహుశా రెండు కూడా ఉండచ్చేమో. "రెండు జింకలకంటే మూడు మంచివి" అనుకున్నాడతను. ఆ ఆలోచనకి

అతని ముఖంలో సంతోషంతో కూడిన చిరునవ్వు ఒకటి మెదిలింది.

కొంతసేపు అలా నిశ్చలంగా నిలబడ్డాక, గడ్డిలో కదులుతూ అతనికొక నీడ కనిపించింది. ఎండుగడ్డిలో ఏదో జరజరా కదిలింది. అతను ఆ నీడను చూసి బాణం వదిలాడు. మరొక శరీరం దబ్బున నేలరాలింది. ఆర్తనాదం మరొకటి వెలువడింది. కానీ అది జింకల అరుపుకాదు! మనిషిఅరుపు!!

వూ-చాంగ్ అక్కడికి పరుగెత్తుకెళ్ళాడు. అతని మూడవ బాణానికి బలయింది నిజంగానే జింక కాదు. అతని కొడుకే! వూ-తోపాటు వేటకు వచ్చిన కొడుకు, ఎలా చేరుకున్నాడో, అక్కడ చచ్చిపడిఉన్నాడు. వూ-చాంగ్ నిశ్చేష్టుడైపోయాడు. ఏదో స్వరం అతనికి చెప్తున్నట్లు అనిపించింది. "వూ-చాంగ్! ఇప్పుడు అర్థమయ్యిందా, బాణం దెబ్బతో కొడుకు చచ్చి పడి ఉంటే ఎలా ఉంటుందో..?! నువ్వు నీ కొడుకును ఎంత గొప్పగా ప్రేమిస్తావో, జంతువులు కూడా తమ పిల్లల్ని అంతగానూ ప్రేమిస్తాయి. నీ చర్యలతో జంతు తల్లులను, జంతు తండ్రులను నువ్వు ఎంత క్షోభపెట్టావో...!

ఆ స్వరాన్ని వింటూ గుండె పగిలిన వూ-చాంగ్ నిస్త్రాణుడై అక్కడ నిలబడిపోయాడు. అంతలో అకస్మాత్తుగా అతనికి అర్థమైంది- గడ్డిలో తనకు వినిపించిన కదలిక జింకదికాదు- నిజానికది పులిది! కానీ అప్పటికే ఆలస్యమైపోయింది...

# ఎవరి సంపద?

'మన గురించి మనం ఏమి అనుకుంటాం' అన్నదాని మీదనే మన ప్రవర్తన ఆధారపడుతుంటుంది. 'తను బిచ్చగాడు' అనుకున్నన్నినాళ్ళూ సోమదత్తుడు ఆ జీవితంలోంచి బయటపడలేకపోయాడు. మరి మనం ఏమి అనుకుంటున్నాం, మన గురించి?

మూలం: Buddhist tales — స్వేచ్ఛానుసరణ: నారాయణ, కొత్తపల్లి

చాలాకాలంక్రితం శ్రావస్తిలో 'ధనదత్తుడు' అనే వ్యాపారి ఒకడు ఉండేవాడు. అతను మహా ధనికుడు. మహారాజులకు కూడా అతనికి ఉన్నంత వైభవం ఉండదని ప్రజలు అనుకునేవాళ్లు. ధనదత్తుడు కూడా అవసరంలో ఉన్నవాళ్లకు సాయం చేస్తూ ధర్మంగా ప్రవర్తించేవాడు; అలా అందరి మన్ననా పొందేవాడు. అయితే వింత ఏమిటంటే, యువకుడిగా ఉన్నప్పుడు ఇదే ధనదత్తుడు ఎన్నో కష్టాలు పడ్డాడు. అప్పట్లో ఎంత వెతుక్కున్నా అతనికి పనే దొరికేది కాదు. పెట్టుబడి మాట దేవుడెరుగు, తినేందుకే ఏమీ

లేక పస్తులుండేవాళ్ళు అతనూ, అతని కుటుంబమూ. ఆ సమయంలోనే అతని భార్య మరణించింది. ఒక్కగానొక్క కొడుకు తప్పిపోయాడు. అంతలో ఇక వేరే ఏ దారీ కనబడని ఆ చీకటిరోజుల్లోకి అకస్మాత్తుగా వెలుగు ప్రవేశించింది. బండిమీద చిన్న వ్యాపారం పెట్టుకునేందుకు వీలు చిక్కింది. చూస్తూ చూస్తూండగానే ధనదత్తుడు ఓడల మీద వర్తకం చేసే స్థాయికి చేరుకున్నాడు; అపర కుబేరుడు అయ్యాడు.

భౌతికంగా చాలా డబ్బు సంపాదించినా, ధనదత్తుడి మనసు మాత్రం అశాంతితో కొట్టు-మిట్టాడేది. "ఇదంతా ఎందుకు, ఎవరికోసం?" లాంటి ఆలోచనలు అతన్ని నిరంతరం పట్టి పీడించేవి. తప్పిపోయిన కొడుకు కోసం అతని మనసు తహతహలాడేది. ఏదో శక్తి తన కొడుకుని తన దగ్గరికి చేర్చినట్లు అనిపిస్తూండేది అతనికి ఒక్కోసారి. అసలతను ఆ ఆశతోటే బ్రతుక్కుంటూ వచ్చాడు. కొడుకుని వెతకటం కోసం అతను చేయని ప్రయత్నమంటూ లేదు. రానురాను ధనదత్తుని శక్తి సన్నగిల్లింది. ముసలివాడౌతున్నాడు..

ఆ సమయంలో- ఎట్టకేలకు- అతని ఆశ ఫలించినట్లు తారసపడ్డాడు, కొడుకు సోమదత్తుడు! పెద్దవాడైతే అయ్యాడు కానీ, పరమదరిద్రుడిగా బ్రతికాడతను ఇన్నేళ్ళూ! వాడిని పెంచిన బిక్షగాళ్ళు వాడికి భిక్షం ఎత్తుకోవటాన్ని మించి మరేమీ నేర్పలేదు!

ధనదత్తుడు చెప్పిన గుర్తుల ఆధారంగా వాడిని గుర్తించిన పనివాళ్ళు, వాడికి ధనవంతులకు తగిన బట్టలు వేయబోతే వాడు వేసుకోలేదు; ధనదత్తుడి దగ్గరికి రమ్మంటే వాడు ఓపట్టాన

రాలేదు. చివరికి సేవకులు వాడి కాళ్ళూ చేతులూ కట్టిపడేసి ఎత్తుకొచ్చారు తండ్రిదగ్గరికి!

ధనదత్తుడు వాడిని చూడగానే గుర్తించాడు. 'సందేహంలేదు- వీడు తనకొడుకే'.

వాడిని చూసిన ఆనందంలో ధనదత్తుడికి నోట మాట రాలేదు. వాడి పరిస్థితి చూస్తే అతని గుండె తరుక్కుపోయింది. ఆనందంతోటీ, దు:ఖం తోటీ కళ్లలోంచి నీళ్ళు కారగా లేచి కొడుకును కౌగలించుకో-బోయాడు ధనదత్తుడు.

అయితే సోమదత్తుడి స్థితి మరోలాగా ఉన్నది. 'తను భిక్షగాడు' అని తప్ప మరేదీ తెలీదు వాడికి. ధనదత్తుడిని, అతని సేవకులని చూస్తేనే వాడికి వణుకు పుట్టుతున్నది. ధనదత్తుడి మహలులో వాడు కనీసం లేచి కూడా నిలబడలేకపోయాడు. సేవకులు ఏమి చెప్పారో వాడికి అసలు అర్థమే కాలేదు. దాంతో వాళ్లు కట్లు విప్పిందే తడవు- వాడు లేచి, ఏడుస్తూ, గబుక్కున బయటికి పరుగు పెట్టాడు.

అతని వెంటపడి పట్టుకోబోయిన పనివాళ్ళను వారించి, ఆపాడు ధనదత్తుడు. "పారిపోతున్న వాడిని పట్టుకోవటం వృధా, దానివల్ల ప్రయోజనం లేదు.. ఇప్పుడున్న యీ పరిస్థితులలో వాడు తన కొడుకే అయినప్పటికీ, వాడిని పట్టుకోవటం వల్ల తనకు ఒనగూరే లాభం ఏదీ లేదు" అనుకున్న ధనదత్తుడు ఒకరిద్దరిని నియోగించి, వాడు ఏం చేస్తున్నాడో చూడమన్నాడు.

సోమదత్తుడు అక్కడి నుండి పారిపోయి యధాప్రకారం అడుక్కోవటం మొదలెట్టాడు. తన బట్టలని చింపుకొని, బురద పట్టించుకొని,

మకిలిగా తయారయ్యాడు. ఊళ్ళోవాళ్ళు జాలిపడి వేసిన ఎంగిలి మెతుకుల్ని ఏరుకొని ఇష్టంగా తినసాగాడు!

ఆ సమయంలో ధనదత్తుడిని ఊరడించాడు, అతని వద్ద పనిచేసే మిత్రపాలుడు. "మీరేమీ కంగారు పడకండి. నాకు కొంత సమయం ఇవ్వండి. పరిస్థితిని నేను చక్కదిద్దుతాను" అని మాట ఇచ్చాడు ధనదత్తుడికి.

తగిన పథకాన్ని సిద్ధం చేసుకున్నాక, ఒకరోజున సోమదత్తుడు తన వద్ద అడుక్కోవటానికి వచ్చినపుడు, మిత్రపాలుడు వాడికి అన్నం పెట్టి, "ఒరే! నీకు నేను రోజూ అన్నం పెట్టగలను- కానీ నాకేం లాభం?! రాత్రిపూట నా దుకాణానికి కావలిగా పడుకుంటానంటే రోజూ అన్నం పెట్టి, మూడు రూపాయలు కూడా ఇస్తాను, చూడు!" అన్నాడు, ముందుగానే ఒక రూపాయి చేతిలో పెడుతూ.

సోమదత్తుడికి ఆ ఆలోచన నచ్చింది. వాడు రోజూ ఉదయం పూట అడుక్కొని, రాత్రిపూట ధనదత్తుడి దుకాణం ముందు పడుకోవటం మొదలెట్టాడు.

ఇలా కొన్నాళ్ళు గడిచాక, మిత్రపాలుడు వాడిని పిలిచి, "ఒరే! ఉదయం పూట ఇక్కడే నిలబడి వచ్చే పోయే బరువులు మోయరాదురా?! నాకు పని జరుగుతుంది, నీకూ నాలుగు డబ్బులు రాలతై?" అన్నాడు.

అట్లా కొన్ని నెలలు గడిచాక, మిత్రపాలుడు వాడికి దుకాణంలో సరుకులందించే పనిపెట్టి, ఉండేందుకు వసతిగా ఒక చిన్న గది చూపించాడు. ఇలా కొన్ని నెలలయ్యాక, అతను వాడికి యీ సారి లెక్కలు చూసుకోవటం నేర్పి, రెండేళ్ళ తర్వాత నమ్మకం చిక్కగానే దుకాణంలో డబ్బు పనిలో

పెట్టాడు. ఇలా కొన్నేళ్ళు గడిచాయి. ఆ సరికి సోమధత్తుడు పనిలో బాగా ఆరతేరటమే గాక, మంచి నమ్మకస్తుడు కూడా అయ్యాడు. అప్పుడుగానీ మిత్రపాలుడు వాడిని ధనగుప్తుడి దగ్గరికి తీసుకుపోలేదు.

ధనగుప్తుడు యీసారి వాడిని బాగా పరిశీలించి, వ్యాపారం గురించి రకరకాల ప్రశ్నలడిగి, "నిన్ను నా ఆంతరంగికునిగా పెట్టుకుంటాను- జీతంతో పాటు నా వ్యాపారంలో వాటా కూడా ఇస్తాను" అని ఆశ చూపించి, అలా తన వ్యాపారాన్నంతా కొద్దికొద్దిగా అప్పగించాడు.

ఆ తర్వాత కొన్నేళ్ళకు ఆయన ఒక పెద్ద ఉత్సవాన్ని ఏర్పాటు చేసి, "సోమదత్తుడు తన కొడుకే" అని పదిమంది ఎదుటా ప్రకటించే సరికి, ఒకప్పటి బిచ్చగాడైన సోమదత్తుడు నివ్వెరపోయాడు: "నాది కాని సంపద, ఏదో దేవుడి చలవ వల్ల అకస్మాత్తుగా నామీద వర్షించింది!" అని అశ్చర్యపోయాడు-

అంతే తప్ప, "తనకు దొరికిన సంపదంతా అసలు ఏనాటికీ తనదే" అని అతనికి అర్థం కాలేదు!

నవ్వు!

**ముందు జాగ్రత్త!**

సుమిత్ర: డాక్టరిచ్చిన మందుబిళ్ళను ఎందుకలా నాలుగువైపులా కత్తిరిస్తున్నావు?

వెంగళప్ప: సైడ్ ఎఫెక్ట్సులు రాకుండా ఉండటానికి!

**పొడుపు కథలకు సమాధానాలు:**

1. వాసన 2. ముగ్గు 3. గంగిరెద్దు 4. ఉత్తరం 5. సీతాఫలం

6. చంద్రుడు 7. ఉయ్యాల 8. పుకారు 9. ఇంగువ 10. అగ్గిపెట్టె

# సురవి-రిషి

యువ కెరటాలు

నిర్వహణ: సౌమ్య, పుస్తకం డాట్ నెట్

'ఈ శీర్షిక కోసం ఈసారి ఎవర్ని పరిచయం చెయ్యాలా' అని ఆలోచిస్తూ ఉంటే, కొన్నేళ్ళ క్రితం చదివిన పుస్తకం గుర్తు వచ్చింది. దాన్ని రాసిన పిల్లలూ గుర్తుకు వచ్చారు. వాళ్ళ గురించి చెబితే మీకూ ప్రోత్సాహకరంగా ఉంటుంది గదా అనిపించింది-ఆ పుస్తకం పేరు "అడ్వంచర్స్ ఇన్ అంటార్కిటికా" (అంటార్కిటికాలో సాహసాలు).

మీకు 'టీనేజ్' అంటే తెలుసుగా? పదమూడేళ్ళ(థర్టీన్)నుండి పంథొమ్మిదేళ్ళ(నైన్టీన్) మధ్య ఉన్న పిల్లల్ని 'టీనేజర్లు' అంటుంటారు.

అట్లాంటి ఇద్దరు టీనేజ్‌పిల్లలు తమ అంటార్కిటికా పర్యటన గురించి రాసిన పుస్తకం అది.

సురవి థామస్, రిషి థామస్ అని ఇద్దరు అక్కా తమ్ముళ్ళు. 2005 లో ఒకసారి వీళ్ళకి అనుకోకుండా అంటార్కిటికా ఖండం వెళ్ళే అవకాశం వచ్చింది. మరి అంటార్కిటికా ఖండం అంటే మాటలా? సృష్టిలో కెల్లా అతి చల్లగా ఉండే ప్రాంతం కదా! పేరుకి ఒక ఖండమే అయినా, అక్కడ మనుషులు పెద్దగా ఉండరు- పరిశోధన కోసం వచ్చేవాళ్ళు ఉంటారు అంతే. అసలుకి అక్కడికి

వెళ్ళడమే అత్యంత సాహసంతో కూడుకున్నది. అలాంటి చోటుకి వెళ్ళి కొన్నాళ్ళు ఉండివచ్చారు వీళ్ళిద్దరూ!

ఆ ప్రయాణంలోనే కాక, అక్కడ ఉన్న పదిహేను రోజుల్లోనూ ఒళ్ళు గగుర్పొడిచే అనుభవాలు ఎదురయ్యాయి వాళ్లకు. అన్నింటినీ తట్టుకుని ధైర్యంగా నిలబడ్డారు వాళ్ళు. అంతే కాదు- ఆ చుట్టుపక్కల ఉన్న ఆసక్తికరమైన విశేషాలనన్నింటినీ- పెంగ్విన్ల వంటి జంతువుల విన్యాసాలలాంటివి- దగ్గరగా చూశారు. తిరిగి వచ్చాక, తమ అనుభవాలన్నిట్నీ వివరిస్తూ ఏకంగా "అడ్వెంచర్స్ ఇన్ అంటార్కిటికా" పుస్తకమే రాసేశారు!

ఈ పుస్తకం 2007 లో విడుదల అయినప్పుడు అక్క సురవి వయసు పదహారేళ్ళు, తమ్ముడు రిషి వయసు పదమూడు. అంటార్కిటికా ఖండంపై పాదం మోపిన అతి పిన్న వయసు భారతీయులు వీరే. కొన్నాళ్ళ తరువాత ఈ పుస్తకంలో ఒక భాగాన్ని 'సి.బి.ఎస్.ఈ' వారి సిలబస్ తో ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకి పాఠ్యాంశంగా కూడా పెట్టారు!

వీళ్ల అమ్మ మన విదేశాంగ శాఖలో పనిచేస్తున్నది. దాంతో వీళ్ళిద్దరికీ రకరకాల దేశాలు చూసే అవకాశం కలిగిందట. ప్రస్తుతం సురవి చదువు పూర్తిచేసుకొని, శాస్త్రవేత్తగా పని చేస్తున్నది. ఇప్పటికీ తను తిరిగే ప్రదేశాల గురించి http://suziventures.blogspot.in అన్న బ్లాగులో వ్యాసాలు రాస్తూ ఉంటుంది తను!

వీళ్ళిద్దరి సంగతులూ చెప్పడం ఎందుకంటే, 'మీరు కూడా మీరు వెళ్ళిన ప్రదేశాల గురించి అప్పుడప్పుడూ చిన్న చిన్న వ్యాసాలు రాయొచ్చు' అని. మనం అందరం దేశాలు తిరుగుతామనీ, అందరు రాసినవీ పుస్తకాలు అయిపోతాయనీ, అన్నీ అంతర్జాతీయ గుర్తింపు పొందుతాయనీ కాదు కానీ, అదొక డైరీలాగా అనమాట. కనీసం మనం వెళ్ళిన ఊర్లలో విశేషాల గురించి తోటి వారితో పంచుకున్నట్లు ఉంటుంది గదా, ఆ వివరాలు రాస్తే!? ఏమంటారు?

మంచి పుస్తకం:

## పసిడిమొగ్గ

**(బడిపిల్లల సాహిత్య మాస పత్రిక )**

ప్రచురణ : ప్రభుత్వ ఉన్నతపాఠశాల, ఆముదాలవలస


పసిడి మొగ్గ
(బడి పిల్లల సాహిత్య మాస పత్రిక)
2014 నూతన సంవత్సర శుభాకాంక్షలు

"అది కావాలని - ఇది కావాలని
మరి మరి నేను అడిగినప్పుడు
అదిగో - ఇదిగో - బూచాడు!
అంటావ్!
చీకటివేళ - ఇంటికెదురుగా
గాలికి అటూ- ఇటూ
ఊగులాడుతూ -
బూచాడేమో జడిపిస్తుంటే
"బూచీ లేదు - గీచీ లేదు.
బజ్జో కన్నా, నా చిన్నా"అని
జోకొడతావ్!

అసలింతకీ చెప్పమ్మా!
బూచాడంటే ఎవరమ్మా?
బూచాడల్లరి పెట్టాడనుకో,
ఎవరిని చెప్పి చూపిస్తుందో
వాళ్లమ్మ!?
అమ్మా! అమ్మా! చెప్పమ్మా!
బూచాడసలు ఉన్నాడా?"

అని రాశారు నాగరాజు మాస్టారు. "అదిగో! అటువైపుగా చూడు - ఆప్యాయంగా పిలుస్తోంది మంచి మార్గం. దాని గుండా వెళ్లు - కాస్త కష్టం అయినా, నేరుగా గమ్యాన్ని చేరుకుంటావు!" అని రాసింది గుదింటి పావని, పదో తరగతి. ఇవి కాక, సరదా కవితతో ఆనందవల్లి (8 ఎ), నానమ్మ చెప్పిన సామెతలతో సూర్యకుమారి(10) , 'నవ్వు, నవ్వించు'తో గౌతమి (8 ఎ).'నేనూ బొమ్మ వేయగలను'అని మిక్కీ మౌస్ బొమ్మతో కమల్ (8 ఎ), 'నా ఆశయం'తో జి.హైమవయి(9 బి)- మురిపించారు.

వ్యాయామోపాధ్యాయులు అప్పన్నగారు ఆటలు ఎందుకు ఆడాలో చెప్పారు -పదవ తరగతి భౌతికశాస్త్రంలో ముఖ్యప్రశ్నలు ఇచ్చారుఇచ్చారు జోగారావు సారు; పదకేళి ఇచ్చారు మోహనరావు అయ్యవారు-

ఇవన్నీ ఎన్ని పేజీలలో-? రెండు A4 సైజు పేజీల్ని మడిచి, మూడుపిన్నులు వేసి! ఒక్కో ప్రతికీ రెండు రూపాయలకంటే తక్కువే ఖర్చయి ఉంటుంది!

ఇంత చక్కటి"బడిపిల్లల సాహిత్య పత్రిక" మొదలుపెట్టించిన ఆముదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీమతి ఎల్. అంజనీదేవిగారు అభినందనీయులు! వారి కృషి మనందరికీ మార్గదర్శకం!

పసిడిమొగ్గ బడిపిల్లల సాహిత్య మాస పత్రిక - ప్రచురణ: ప్ర.ఉ.పాఠశాల, ఆముదాలవలస. ఫోను: 9441913829

**కృతజ్ఞతలు:** ఈ సంచిక వెలువడటం కోసం ఇరవైఐదు వేల రూపాయలు విరాళంగా ఇచ్చిన దాత శ్రీ బాల్‌రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. విజయవాడ పుస్తక ప్రదర్శనలో స్టాలు ఖర్చును మొత్తాన్నీ ప్రేమతో భరించిన కృపాకర రావుగారికి , పత్రిక నిర్వహణలో వెన్నుదన్నుగా ఉండి ప్రోత్సహిస్తున్న ఆశావాది- రాధగారికి కృతజ్ఞతలు. పత్రికకోసం రచనలు పంపుతున్న చిన్నారులకు ఆశీస్సులు; పెద్దలకు నమస్కారాలు. దీన్నంతా సాధ్యం చేస్తున్న ఉబుంటు లినక్సు వారికి, ఓపెన్‌సోర్సు నిపుణులకు ధన్యవాదాలు.

# బోరు

"మామయ్యా, ఇప్పుడేం చెయ్యాలి, బోరుకొడుతోంది నాకు! " గొణిగింది చిట్టి.

చిట్టి వాళ్ళు సెలవులకని మా యింటికి వచ్చారు- పట్నం నుండి.

"అట్లా ఎంచక్కా దారంటే నడుచుకుంటూ పోయి రండమ్మా, పిల్లలందరూనూ..! " అన్నాను.

"నాకు కాళ్ళు నొప్పెడతాయి మామయ్యా, దూరం నడవకూడదు- " అంది చిట్టి.

"సరే, మరైతే ఏం చేస్తారు, పిల్లలంతా కలిసి ఇంట్లోనే ఏ బాడ్మింటనో ఆడండి!" అన్నాను.

"అబ్బా! బాడ్మింటన్ ఆడీ ఆడీ బోరైంది మామయ్యా, మాకు వారంలో మూడు రోజులు బాడ్మింటన్ క్లాసులుంటాయిగద!" అంది చిట్టి- "మిగతా మూడు రోజులు కరాటే క్లాసులుంటాయి" అని జోడిస్తూ.

"అవునా, మరైతే ఇక్కడి పిల్లలకు కరాటే నేర్పు! వీళ్ళెవరికీ రాదుగా?!" అన్నాను గర్వంగా వీపు చరచుకొంటూ.

"అయ్యో! మేం నేర్పకూడదు. థార్డ్ స్టేజ్ బ్లాక్ బెల్ట్ వచ్చేవరకు నేర్పించేందుకు వీలుండదు. నేనిప్పుడు ఫస్ట్ స్టేజ్ బ్రౌన్ బెల్టేగా?! " అంది చిట్టి విచారంగా.

"అవునులే.., మరైతే నువ్వు ఓ పని చెయ్యి. చీపురు పట్టుకొని ఇల్లంతా ఊడ్చుకుంటూ రా!" అన్నాన్నేను తేలికగా.

చిట్టి నవ్వుతూనే నామీద జాలి పడింది: . "ఉహూఁ... నాకు ఊడ్చటం రాదట.. అమ్మ చెప్పింది. ఇంకేదైనా మంచి పని చెప్పు మామయ్యా!" అంది.

నేను ఆలోచించాల్సి వచ్చింది. "టి.వి చూడచ్చు, కంప్యూటర్లో ఏ బొమ్మలో గీయచ్చు,.. ఛెస్ ఆడచ్చు.." అన్నాను దానికేసి చూస్తూ. చిట్టి దిగాలుగా ముఖం పెట్టింది. "మరి నీకు ఉలెన్ అల్లటం వచ్చా? సత్యకి వచ్చు. అడుగు-నేర్పిస్తుంది. బలే ఉంటుంది ఆ పని!" అన్నాను ఉత్సాహం తెచ్చిపెట్టుకొని.

"అబ్బా! ఎప్పుడూ నేర్చుకోవటమేనా,| ఇంకేదైనా చెప్పు మామయ్యా!" అంది చిట్టి.

"నేర్చుకోవటం ఇష్టంలేని పిల్లలతో ఏం చెయ్యాలి...? అని అదిరిపడ్డాను నేను-

అంతలో సత్య వచ్చి చిట్టిని లాక్కెళ్లింది: "రావే! కథలు చెప్పుకుందాం, రా! ఊరికే ఎందుకు, నాన్నతో?!" అంటూ.

"బోరైపోయిన యీ తరపు పిల్లలచేత కూడా ఉత్సాహపు తళుకుల్ని ఏరించేవి కథలేగా! మరి ఇంత మంచి ఐడియా నాకెందుకు రాలేదు.. ?!" అనుకున్నాను నేను, సంతోషంగా ఎగురుకుంటూ పోతున్న పిల్లలకేసి చూస్తూ.

Published by NarayanaSarma for Kottapalli Prachuranalu,1-127/A, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP. Ph: 7702877670 mail: team@kottapalli.in and printed at Mudrica Offset Printers, Vijayawada,Phone:08662579129